ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY 5
అనకాపల్లి
జిల్లా వార్తలు
మంగళవారం 24 డిసెంబరు 2024

28 నుంచి అరకులోయకు ప్రత్యేక రైలు

విశాఖపట్నం, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): పర్యాటకుల సౌకర్యార్థం విశాఖ-అరకులోయ మధ్య ఈ నెల 28 నుంచి ప్రతి శని, ఆదివారాలు ప్రత్యేక రైలును ప్రవేశపెడుతున్నామని వాల్తేరు డివిజన్ సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు. 08525 నంబరు గల రైలు ఈ నెల 28 నుంచి జనవరి 19వ తేదీ వరకు ప్రతి శని, ఆదివారాల్లో ఉదయం 8.30 గంటలకు విశాఖలో బయలుదేరి 11.45 గంటలకు అరకులోయ చేరుతుంది. తిరుగు ప్రయాణంలో 08526 నంబరుతో ఈ రైలు అదేరోజు మధ్యాహ్నం 2.00 గంటలకు అరకులోయలో బయలుదేరి సాయంత్రం 6.00 గంటలకు విశాఖ చేరుతుంది.

ఆశల మోసులతో...

చెరకు క్రషింగ్‌కు గోవాడ షుగర్స్ అడుగులు

- వెంటాడుతున్న బకాయిలు, అప్పులు
- తగ్గిపోయిన చెరకు సాగు విస్తీర్ణం
- ఒకప్పుడు ఐదు లక్షల టన్నులకుపైగా చెరకు క్రషింగ్
- ఇప్పుడు రెండు లక్షల టన్నులకు చేరుకోవడం గగనం
- సానుకూలత చూపుతున్న కూటమి ప్రభుత్వం
- ఈ సీజన్ గట్టెక్కితే గోవాడకు మంచి రోజులు?
- క్రషింగ్ సీజన్ ప్రారంభం రేపు


గోవాడ షుగర్ ఫ్యాక్టరీ

చోడవరం, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సహకార రంగంలో నడుస్తున్న ఏకైక చక్కెర కర్మాగారం గోవాడ షుగర్ ఫ్యాక్టరీ మనుగడ కోసం చివరిపోరాట దిశగా అడుగులు వేస్తున్నది. ఆర్థిక ఇబ్బందుల్లో కొట్టుమిట్టాడుతున్న ఈ ఫ్యాక్టరీని ఆదుకోవడానికి కూటమి ప్రభుత్వం గట్టి సంకల్పంతో ఉన్న నేపథ్యంలో, ప్రస్తుత క్రషింగ్ సీజన్ ఇటు రైతులకు, అటు కార్మికులకు కీలకంగా మారింది. క్రషింగ్ సజావుగా నిర్వహించి, చెరకు రైతులకు త్వరగా చెల్లింపులు జరపగలిగితే ఫ్యాక్టరీకి మంచి రోజులు వచ్చేనట్టేనని భావిస్తున్నారు. గత సీజన్‌కు సంబంధించి రైతులకు ఇంకా పూర్తిస్థాయిలో బకాయిలు చెల్లించకపోవడంతో ఈ ఏడాది క్రషింగ్ జరుగుతుందా, లేదా అనే సందేహాలు వ్యక్తం అయ్యాయి. ఈ నేపథ్యంలో 25వ తేదీ నుంచి క్రషింగ్ ప్రారంభం కానుండడంతో ఫ్యాక్టరీ పరిస్థితిపై అన్నివర్గాల్లో ఆసక్తి కలుగుతున్నది.

చోడవరం (గోవాడ) సహకార చక్కెర ఫ్యాక్టరీకి ఘనమైన చరిత్ర వుంది. సీజన్‌లో ఐదు లక్షల టన్నులకుపైగా చెరకు క్రషింగ్ చేసిన రికార్డు జిల్లాలో ఈ ఫ్యాక్టరీకే సొంతం. అయితే కర్ణుడి మరణానికి సవాలక్ష కారణాలు అన్నట్టు.. గోవాడ షుగర్ ఫ్యాక్టరీ పతనానికి ఎన్నో కారణాలు వున్నాయి. ముఖ్యంగా అంతర్జాతీయ మార్కెట్‌లో పంచదార ధరలు పతనం కావడం, ఉత్పత్తి వ్యయం కన్నా పంచదార అమ్మకాల ద్వారా వచ్చే ఆదాయం తక్కువ వుండడం, పంచదార రికవరీ శాతంలో మెరుగుదల లేకపోవడం వంటి కారణాలను ప్రధానంగా చెప్పుకోవాలి. వీటి కారణంగా ఆర్థిక ఇబ్బందులు తలెత్తడంతో రైతులకు చెరకు బకాయిల చెల్లింపుల్లో తీవ్రజాప్యం జరుగుతున్నది. దీంతో రైతులు ప్రత్యామ్నాయ పంటల వైపు మళ్లడంతో ఫ్యాక్టరీకి చెరకు సరఫరా ఏటేటా తగ్గుతూ వస్తున్నది. 2010-11 నుంచి 2013-14 వరకు ప్రతి సీజన్‌లో ఐదు లక్షల టన్నులకు మించి చెరకు క్రషింగ్ జరిగింది. గత దశాబ్దాన్నర కాలంలో 2013-14 సీజన్ గోవాడ్ షుగర్‌ఫ్యాక్టరీకి స్వర్ణ యుగంగా చెప్పాలి. రికార్డుస్థాయిలో 5,50,975 టన్నుల చెరకు గానుగాడారు. తరువాత నాలుగైదేళ్ల వరకు (2016-17 మినహా) ఒడిదుడుకులు ఎదురైనప్పటికీ నాలుగున్నర లక్షల టన్నులకుపైగానే చెరకు క్రషింగ్ జరిగింది. ఇక వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత ఫ్యాక్టరీకి కష్టకాలం మొదలైంది. ప్రభుత్వ సహకారం లేకపోవడంతో చెరకు రైతులకు చెల్లింపుల్లో తీవ్ర జాప్యం జరిగింది. ఫలితంగా చెరకు సాగు తగ్గిపోగా, పలువురు రైతులు ప్రైవేటు ఫ్యాక్టరీలకు చెరకు విక్రయించారు. దీంతో 2021-22లో 2.91 లక్షల టన్నులకు పడిపోయింది. తరువాత ఏటేటా తగ్గిపోతూ గత సీజన్‌లో (2023-24) లక్షా 70 వేల 601 టన్నులకు దిగజారింది. ఎక్కడ ఐదున్నర లక్షల టన్నులు.. ఎక్కడ 1.7 లక్షల టన్నులు! పదేళ్ల కాలంలో 30 శాతానికి తగ్గిపోయింది.

పంచదార ధరల్లో పెద్దగా పురోగతి లేకపోవడం, పంచదార ఉత్పత్తి వ్యయం మరింత పెరిగిపోవడంతో అప్పుల ఊబిలో నుంచి బయటపడలేని పరిస్థితికి చేరింది. ఇదే సమయంలో చెరకు రైతులకు సకాలంలో డబ్బులు చెల్లించకపోవడంతో చెరకు సాగును తగ్గించేశారు. గత సీజన్‌లో చెరకు సరఫరా చేసిన రైతులకు ఇంకా టన్నుకు రూ.419 చొప్పున రూ.7.14 కోట్లు చెల్లించాల్సి వుంది. వీటికి తోడు రవాణా ఛార్జీల బకాయిలు మరో కోటి రూపాయల వరకు ఉన్నాయి. ఉద్యోగ విరమణ చేసిన కార్మికులకు గ్రాట్యుటీతోపాటు, ఇతర బకాయిలు చెల్లించవలసి ఉంది.

ప్రస్తుతం ఫ్యాక్టరీకి రూ.40 కోట్ల మేర ఆప్కాబ్ రుణ భారం వుంది. ఇలాంటి పరిస్థితుల్లో రానున్న సీజన్‌లో రెండు లక్షల టన్నుల చెరకును క్రషింగ్ చేయాలని ఫ్యాక్టరీ అధికారులు యోచిస్తున్నారు. కానీ ఆర్థిక ఇబ్బందుల వల్ల ఈ ఏడాది రైతులకు ఎరువులు, చెరకు దవ్వ సరఫరా చేయలేదు. ఫలితంగా గత ఏడాదితో పోలిస్తే చెరకు సాగు తగ్గింది. ఫ్యాక్టరీ సిబ్బంది గట్టిగా ప్రయత్నిస్తే తప్ప రైతులు ఫ్యాక్టరీకి చెరకు సరఫరా చేసే వాతావరణం కనిపించడం లేదు.

గోవాడ షుగర్ ఫ్యాక్టరీ అప్పుల ఊబిలో నుంచి బయటపడాలంటే పంచదార ఉత్పత్తితోపాటు, ఇథనాల్ ప్లాంట్ లేదా డిస్టిలరీ ఏర్పాటు చేసి ఆదాయం వనరులు పెంచుకోవాలి. కూటమి ప్రభుత్వం ఇథనాల్ ప్లాంట్ లేదా డిస్టిలరీ ఏర్పాటుకు సానుకూలంగా ఉండడంతో ప్రస్తుత క్రషింగ్ సీజన్ గట్టెక్కితే ఫ్యాక్టరీ గాడిలో పడుతుంది. ఈ మేరకు చెరకు రైతుల్లో నమ్మకం పెంచడంతోపాటు, చెరకు సాగు విస్తీర్ణం పెంచేదిశగా కృషి చేయాల్సి వుంది.

రోడ్ల పనులకు వర్షాలతో ఆటంకం!

- అల్పపీడనాలతో మరో వారం వరకు ఇదే పరిస్థితి
- సంక్రాంతినాటికి పనులు పూర్తికావడంపై అనుమానాలు


పనులు ఆపేసిన తాళ్లపాలెం-నర్సీపట్నం ఆర్అండ్‌బీ రోడ్డు

(అనకాపల్లి-ఆంధ్రజ్యోతి)

అల్పపీడనం ప్రభావంతో జిల్లాలో రోడ్ల మరమ్మతు పనులు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. ప్రస్తుతం నెలకొన్న వాతావరణ పరిస్థితులు, వాతావరణ శాఖ వెల్లడించిన సమాచారం మేరకు మరో వారం రోజుల వరకు వర్షాలు పడే అవకాశం వుంది. దీంతో ఈ నెలాఖరు వరకు రహదారుల నిర్మాణం, మరమ్మతు పనులు ముందుకు సాగే పరిస్థితి కనిపించడంలేదు.

గత వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లపాటు రోడ్ల నిర్వహణను పూర్తిగా విస్మరించింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో రోడ్లను మెరుగుపరిచేందుకు సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అధిక ప్రాధాన్యం ఇచ్చి పెద్ద మొత్తంలో నిధులు మంజూరు చేశారు. ఈ నిధులతో రోడ్ల నిర్మాణం, మరమ్మతు పనులను డిసెంబరులోగా పూర్తిచేసి, సంక్రాంతినాటికి రోడ్లపై ఎక్కడా గోతులు కనిపించడానికి వీల్లేదని ఆదేశించారు. జిల్లాలో మిషన్ పాట్‌హోల్ ఫ్రీ కార్యక్రమం కింద 540 కిలోమీటర్ల పరిధిలో ఆర్అండ్‌బీ రోడ్లపై ఏర్పడిన గుంతలను పూడ్చేందుకు 123 పనులు మంజూరు చేశారు. సంక్రాంతినాటికి అన్ని పనులు పూర్తి చేయాలనే ప్రణాళికతో ముందుకు వెళుతున్నారు. ఇప్పటికే 60 పనులు ప్రారంభించి, సుమారు 29 కిలోమీటర్ల మేరకు తారు వేశారు. మిగిలిన 63 పనులు

... మిగతా 8వ పేజీలో

గ్రామాల అభివృద్ధే కూటమి లక్ష్యం

- గత ప్రభుత్వం పంచాయతీలను నిర్వీర్యం చేసింది
- పోలవరం ఎడమ కాలువ, సుజల స్రవంతి ప్రాజెక్టును పూర్తిచేస్తాం
- గతుకుల రోడ్లకు సంక్రాంతిలోగా మరమ్మతులు
- స్పీకర్ అయ్యన్నపాత్రుడు
- వచ్చే నెల 8న జిల్లాకు ప్రధానమంత్రి రాక
- పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయనున్న నరేంద్ర మోదీ
- ఎంపీ సీఎం రమేశ్ వెల్లడి
- కశింకోట మండలంలో రూ.4.53 కోట్ల అభివృద్ధి పనులకు శ్రీకారం


సమావేశంలో మాట్లాడుతున్న స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు. వేదికపై ఎంపీ సీఎం రమేశ్, ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ, మాజీ ఎమ్మెల్సీ బుద్ద నాగజగదీశ్, కార్పొరేషన్ల చైర్మన్లు పీలా గోవింద, మళ్ల సురేంద్ర, బీజేపీ జిల్లా అధ్యక్షుడు పరమేశ్వరరావు

కశింకోట, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో అన్ని గ్రామ పంచాయతీలను అభివృద్ధి చేసి ప్రజలకు పూర్తిస్థాయిలో సదుపాయాలు కల్పించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు అన్నారు. మండలంలో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు సోమవారం ఇక్కడ శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో అయ్యన్న మాట్లాడుతూ, గత ప్రభుత్వం గ్రామాల్లో ఒక్క అభివృద్ధి పనికూడా చేయకుండా పంచాయతీలను నిర్వీర్యం చేసిందని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత పంచాయతీలను అభివృద్ధి చేసేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ అహర్నిశలు శ్రమిస్తున్నారన్నారు. ఒకవైపు గత ప్రభుత్వం చేసిన అప్పులను తీరుస్తూ, మరోవైపు రాష్ట్రాన్ని అభివృద్ధి బాటలో నడిపిస్తున్నారని కొనియాడారు. కూటమి ప్రభుత్వం గత ఆరు నెలలో అనకాపల్లి నియోజకవర్గంలో అభివృద్ధి పనులకు రూ.65 కోట్లు మంజూరు చేసిందన్నారు. గతంలో తెలుగుదేశం పార్టీ అధికారంలో వున్నప్పుడు ఇక్కడ ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ప్రాజెక్టు నిర్మాణానికి నిధులు మంజూరు చేయగా, తరువాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం పనులన్నీ ఆపేసిందని ధ్వజమెత్తారు. పోలవరం ఎడమ కాలువతోపాటు ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ప్రాజెక్టును పూర్తిచేసి

... మిగతా 8వ పేజీలో

మళ్లీ వర్ష భయం!

అల్పపీడన ప్రభావంతో మేఘావృతం

- పలు చోట్ల తేలికపాటి జల్లులు
- ఆదరా బాదరాగా కుప్పలు వేసుకున్న వరి రైతులు
- కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ కొనసాగింపు


రావికమతంలో వరి పనలను కుప్పలు పెడుతున్న రైతులు

కంట్రోల్ రూమ్	ఫోన్ నంబరు
అనకాపల్లి కలెక్టరేట్	08924-226599
అనకాపల్లి ఆర్డీఓ	9491998293
నర్సీపట్నం ఆర్డీఓ	7075356563

(అనకాపల్లి-ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)

బంగాళాఖాతంలో గత వారం ఏర్పడిన తీవ్రవాయుగుండం అల్పపీడనంగా బలహీనపడి స్థిరంగా నైరుతి బంగాళాఖాతంలో కొనసాగుతుండడంతో దీని ప్రభావం సోమవారం అనకాపల్లి జిల్లాపై కనిపించింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆకాశం మేఘావృతమైంది. రావికమతం, మాడుగుల, పాయకరావుపేట, తదితర మండలాల్లో చెదురుమదురుగా జల్లులు పడ్డాయి మరో రెండు రోజులపాటు ఇదే వాతావరణం కొనసాగే అవకాశం ఉందని, పలుచోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం వెల్లడించింది. దీంతో ఇటు వరి రైతులు, అటు జిల్లా యంత్రాంగం అప్రమత్తమైంది. గత వారం వరి పైరు కోత కోసిన పొలాల్లో చాలా మంది కుప్పలు వేసుకోగా, కూలీల కొరత కారణంగా కొంతమంది రైతులు కుప్పలు వేసుకోలేకపోయారు. దీంతో గురు, శుక్రవారాల్లో కురిసిన వర్షాలకు వరి పనలు తడిసిపోయాయి. ధాన్యం మొలకెత్తకుండా, రంగు మారకుండా వుండడానికి ఉప్పునీటి ద్రావణాన్ని పిచికారీ చేశారు. పొలాల్లో నిలిచిన వర్షపు నీటిని బయటకు పంపే ఏర్పాట్లు చేశారు. శనివారం మధ్యాహ్నం నుంచి ఆదివారం సాయంత్రం వరకు ఎండ కాయడంతో వరి పనలు కొంతమేర ఆరాయి. సోమవారం మళ్లీ ఆకాశం మేఘావృతం కావడంతో వరి రైతులు పొలాలకు పరుగులు తీశారు. ఆదరాబాదరాగా వరి కుప్పలు వేసుకున్నారు. ఒకేసారి ఎక్కువ విస్తీర్ణంలో వరి కోతలు పూర్తిచేసిన గ్రామాల్లో కూలీల కొరత కారణంగా సోమవారంనాటికి కూడా వరి కుప్పలు వేయలేదు. మంగవారం వర్షం పడకపోతే కుప్పలు వేసుకుంటామని, లేకపోతే పనలు తడిసిపోయి ధాన్యం రంగుమారడం, మొలకెత్తడం జరిగే అవకాశం వుందని రైతులు అంటున్నారు.

కాగా బంగాళాఖాతంలో అల్పపీడనం కొనసాగుతుండడంతో కలెక్టరేట్‌లో కమాండ్ కంట్రోల్ రూమ్‌ను కొనసాగించాలని కలెక్టర్ విజయకృష్ణన్ ఆదేశించారు. మండలాల్లో అధికారులు అందుబాటులో ఉండాలని కోరారు. రానున్న 48 గంటల్లో సముద్ర తీర ప్రాంతంలో 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశం ఉన్నందున సముద్రంలో చేపల వేటను రెండు రోజులపాటు నిషేధించారు. కలెక్టరేట్‌తోపాటు అనకాపల్లి, నర్సీపట్నం ఆర్డీఓ కార్యాలయాల్లో 24 గంటలూ అందుబాటులో ఉండేలా కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేసి సిబ్బందిని నియమించారు.

రక్షిత్ ఫార్మాలో ప్రమాదం


ప్రమాదం చోటుచేసుకున్న రక్షిత్ డ్రగ్స్ పరిశ్రమ

విష వాయువులు లీక్ కావడంతో ఇద్దరు కార్మికులకు తీవ్ర అస్వస్థత

- ఒకరి పరిస్థితి ఆందోళనకరం

పరవాడ, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): పరవాడ ఫార్మా సిటీలోని 'రక్షిత్ డ్రగ్స్ ప్రైవేటు లిమిటెడ్' పరిశ్రమలో సోమవారం విష వాయువు లీక్ కావడంతో ఇద్దరు కార్మికులు అస్వస్థతకు గురయ్యారు. వారిలో ఒకరి పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. ఇందుకు సంబంధించి పరవాడ సీఐ జి.మల్లికార్జునరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పరిశ్రమలోని ప్రొడక్షన్ బ్లాక్-1లో ఒడిశా రాష్ట్రానికి చెందిన కార్మికులు ఉగ్రెసర్ గౌడ (26), దేవ్‌బాగ్ (38) సోమవారం తెల్లవారుజామున ఐదున్నర గంటలకు స్పృహ కోల్పోయి ఉన్నారు. వారిని బ్లాక్-2 నుంచి కిందకు వస్తూ కెమిస్టు నాగేశ్వరరావు గమనించారు. అప్పటికే దేవ్‌బాగ్ అపస్మారక స్థితిలోకి జారుకోగా, ఉగ్రెసర్ గౌడ ఫిట్స్ వచ్చినట్టు కాళ్లు, చేతులు కొట్టుకుంటున్నారు. వెంటనే ఇద్దరికీ పరిశ్రమలోనే ఆక్సిజన్ ఏర్పాటుచేసి అనంతరం గాజువాక సమీపంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించారు. వీరిలో దేవ్‌బాగ్ పరిస్థితి ఆందోళనకరంగా ఉంది.

ప్రొడక్షన్ బ్లాక్-1లో మొత్తం తొమ్మిది మంది కార్మికులు పనిచేస్తున్నారు. తెల్లవారుజామున


వాయువులు లీకైన రియాక్టర్‌ను పరిశీలిస్తున్న సీఐ మల్లికార్జునరావు, తదితరులు

ఐదున్నర గంటల సమయంలో మిగతా ఏడుగురు షిఫ్ట్ ఛేంజింగ్ కోసమని సెక్యూరిటీ వద్దకు వెళ్లి పంచింగ్ చేయడంలో నిమగ్నమయ్యారు. అదే సమయంలో బ్లాక్-1లో రియాక్టర్ నుంచి హైడ్రోజన్ సల్ఫేడ్ వాయువు రియాక్టర్‌కు చెందిన స్క్రబ్బర్ నుంచి లీకై ఉండవచ్చునని, వాటిని పీల్చడం వల్ల అక్కడ ఉన్న ఇద్దరూ అస్వస్థతకు గురై ఉంటారని ప్రాథమిక నిర్ధారణకు వచ్చారు. ఉగ్రెసర్, దేవ్‌బాగ్‌లు షిఫ్ట్ ముగిసిన తరువాత కాసేపు విశ్రాంతి తీసుకోవడానికి అక్కడ కూర్చుని ఉంటారని తోటి కార్మికులు చెబుతున్నారు. వాయువులు ప్రొడక్షన్ బ్లాక్‌లో ఎక్కడ నుంచి లీకయ్యాయో గుర్తించే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు.

సంఘటనా స్థలిని పరిశీలించిన అధికారులు

ప్రమాదం చోటుచేసుకున్న రక్షిత్ డ్రగ్స్‌లోని ప్రొడక్షన్ బ్లాక్‌ను పరిశ్రమల తనిఖీ అధికారులు జె.శివశంకర్‌రెడ్డి, జేవీఎస్ నారాయణరావు, తహసీల్దార్ ఎస్వీ అంబేద్కర్, సీఐ మల్లికార్జునరావుతో పాటు పీసీబీ, అగ్నిమాపక శాఖ

... మిగతా 8వ పేజీలో

సబ్ రిజిస్ట్రార్ ఆఫీసులో స్టాంపుల కొరత

- బ్యాంకు రుణాలు తీసుకోవాలంటే స్పెషల్ ఎడ్‌హెసివ్ స్టాంపులు అవసరం
- నర్సీపట్నంలో ఏడాది నుంచి అందుబాటులో లేని రూ.100 ఎస్‌ఏ స్టాంపులు
- రూ.50, రూ.20, రూ.10 విలువ చేసే స్టాంపులు సైతం కొరత
- ఇతర కార్యాలయాల నుంచి రప్పించని అధికారులు
- ఇబ్బంది పడుతున్న ప్రజలు



స్పెషల్ ఎడ్‌హెసివ్ స్టాంపులు


నర్సీపట్నం సబ్ రిజిస్ట్రార్ ఆఫీసు

నర్సీపట్నం, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలలో స్పెషల్ ఎడ్‌హెసివ్ స్టాంపుల కొరత వల్ల ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. బ్యాంకు రుణాలకు దరఖాస్తు చేసుకున్నప్పుడు ఎడ్‌హెసివ్ స్టాంప్స్ అవసరం పడుతుంది. బ్యాంకు అధికారులు ఇచ్చిన ఫారాల మీద ఈ స్టాంప్స్ అతికించి ఇస్తేనే రుణాలు మంజూరు చేస్తారు. నర్సీపట్నం సబ్ రిజిస్ట్రార్ ఆఫీసులో ఎస్ఏ స్టాంప్స్ లేకపోతే జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయం లేదా వేరే సబ్ రిజిస్ట్రార్ ఆఫీసు నుంచి రప్పించుకోవాలి. కానీ నర్సీపట్నం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం అధికారులు ఆ దిశగా ఎటువంటి చర్యలు చేపట్టలేదు. దీంతో ఎస్ఏ స్టాంపులు అందుబాటులో లేకపోవడంతో బ్యాంకుల నుంచి రుణాలు పొందాలనుకునేవారు ఇబ్బంది పడుతున్నారు. రూ.100 విలువ చేసే స్పెషల్ ఎడ్‌హెసివ్ స్టాంపులు గత ఏడాది డిసెంబరు నుంచే అందుబాటులో లేవు. ఇది జరిగి ఏడాది దాటిపోయినా అధికారులు పట్టించు కోవడం లేదు. రూ.50 విలువ చేసే ఎస్ఏ స్టాంపులు ఈ సంవత్సరం ఏప్రిల్ 24తో అయిపోయాయి. ఇక రూ.20, రూ.10 విలువ చేసే ఎస్ఏ స్టాంపులు నవంబరు 7వ తేదీన, రూ.5 విలువ చేసే

... మిగతా 8వ పేజీలో

ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి బస్సు మాయం!

- చోరీకి తమిళనాడు వాసి యత్నం
- అల్లూరి జిల్లా చింతలూరులో బస్సును స్వాధీనం చేసుకున్న పోలీసులు
- నిందితుడిని అరెస్టు చేసి విచారిస్తున్న సీఐ గోవిందరావు


నిందితుడు చోరీ చేసిన బస్సు ఇదే

- మెయిన్‌లో

మొక్కల ప్రేమికుడు

- 8లో

- పర్యావరణ పరిరక్షణకు దీక్ష
- సొంత డబ్బుతో కార్యాచరణ
- ఇప్పటికే 400 మొక్కలు నాటిన వైనం



ఆందోళనలో అన్నదాతలు

- తీవ్ర అల్పపీడనంతో మారిన వాతావరణం
- కుప్పలు వేయడానికి పొలాలకు పరుగు
- కుటుంబ సభ్యులంతా పొలం పనుల్లోనే..

ఎలమంచిలి, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): వాతావరణ శాఖ తీవ్ర అల్పపీడనం హెచ్చరికలతో రైతన్నలు ఆందోళనకు గురవుతున్నారు. ఇటీవల కురిసిన వర్షాలు రైతన్నలను తీవ్ర నష్టానికి గురిచేసిన సంగతి మరువక ముందే మరోసారి వర్షాలు ఉన్నాయన్న హెచ్చరికలతో రైతులు అప్రమత్తమయ్యారు. మండలంలో ఎక్కువ గ్రామాల్లో రైతులు గత రెండు రోజులు వరి కోతలు కోసి పనలను ఆరబెట్టారు. మళ్లీ వర్షాల సూచనతో పూర్తిగా ఆరకపోయినా సోమవారం వరి కుప్పలు పెట్టారు. కూలీలు దొరక్కపోవడంతో కొంతమంది రైతులు ఇంటిల్లపాది కోసిన వరి పనలను కుప్పలు పెట్టారు. ఏటికొప్పాకలో జి. దేముడు అనే రైతు పనులకు కూలీలు దొరక్కపోవడంతో చదువుతున్న తమ ఇద్దరు పిల్లలు, భార్య, బంధువుల సాయంతో వరి కుప్పలు పెట్టారు. వరుణుడు కరుణించి తమ పంట చేతికి అందేలా చూడాలని రైతులు వేడుకుంటున్నారు.


ఏటికొప్పాకలో కుటుంబ సభ్యులంతా కలిసి వరి పనలు మోస్తున్న దృశ్యం


సత్యవరం ప్రాంతంలో కుప్పలు వేస్తున్న రైతులు

అల్పపీడనంతో రైతుల్లో టెన్షన్

పాయకరావుపేట రూరల్: వాతావరణం మార్పులతో మండలంలోని అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. శనివారం, ఆదివారం ఎండ కాయడంతో తీవ్ర అల్పపీడనం లేదని ఆనందించిన రైతులు వరి కోతలను ముమ్మరం చేశారు. అయితే సోమవారం ఉదయం నుంచి ఆకాశంలో మబ్బులు కమ్మి అక్కడక్కడ తుంపర్లు పడడంతో రైతులలో మళ్లీ గుబులు మొదలైంది. సోమవారం రైతులు వరి కుప్పలు వేయడానికి పరుగులు తీశారు. పనలపై వర్షం పడితే తీవ్రంగా నష్టపోతామనే భయంతో హడావిడిగా కుప్పలు వేశారు. ఈ నెలలో ఒకదాని తరువాత మరొకటి వరుస అల్పపీడనాలు రావడంతో రైతులు ఆందోళనలో ఉన్నారు. మండలంలోని మంగవరం, సత్యవరం, పెదరాంభద్రపురం, పెంటకోట గోపాలపట్నం, శ్రీరాంపురం, గుంటపల్లి తదితర గ్రామాలలో ఇప్పటికే వరికోతలు కోశారు. ఎక్కడ చూసినా పొలాల్లో వరి పనలు కనిపిస్తున్నాయి. వర్షం కురవకుండా గండం నుంచి గట్టెక్కించాలని రైతులు మొక్కుకుంటున్నారు.

అంబేడ్కర్ పార్కును పరిశీలించిన ఏపీఈడబ్ల్యూఐడీసీ ఈఈ

పాయకరావుపేట, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో అధ్వాన స్థితిలో ఉన్న అంబేడ్కర్ పార్కును సోమవారం ఏపీ ఎడ్యుకేషన్, వెల్ఫేర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డవలప్‌మెంట్ కార్పొరేషన్ ఈఈ రమేష్ పార్కును పరిశీలించారు. ఈ సందర్భంగా పార్కు అభివృద్ధి తదితర అంశాలపై టీడీపీ మండల అధ్యక్షులు పెదిరెడ్డి చిట్టిబాబు తదితరులతో చర్చించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర హోం మంత్రి అనిత ఆదేశాల మేరకు అంబేడ్కర్ పార్కు అభివృద్ధికి ప్రతిపాదనలు తయారుచేసి ప్రభుత్వానికి అందజేయనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఈఈ జి.ప్రసాద్, ఏఈఈ స్వరూప్, ఎస్‌డబ్ల్యూఓ జయలక్ష్మి, ఎంపీటీసీ సభ్యురాలు మల్లపురెడ్డి రమాకుమారి, టీడీపీ నాయకులు వేములపూడి అప్పారావు, కట్టా శ్రీను, బోడపాటి శ్రీను తదితరులు పాల్గొన్నారు.


అంబేడ్కర్ పార్కును పరిశీలిస్తున్న ఏపీఈడబ్ల్యూఐడీసీ ఈఈ రమేష్ తదితరులు

ఏయూ హాకీ జట్టుకు నక్కపల్లి విద్యార్థినుల ఎంపిక


ఏయూ హాకీ జట్టుకు ఎంపికైన నక్కపల్లి డిగ్రీ కళాశాల విద్యార్థినులు

నక్కపల్లి, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన నలుగురు విద్యార్థినులు ఏయూ హాకీ జట్టుకు ఎంపికైనట్టు ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.శివయ్య తెలిపారు. తమ కళాశాలకు చెందిన కె.జ్యోతిశ్రీ, కె.వరలక్ష్మి, షేక్ హుస్సేన్ బీబీ, డి.కౌసల్య ఈ నెల 26వ తేదీ నుంచి తమిళనాడులోని భారతిదాసన్ విశ్వవిద్యాలయంలో నిర్వహించే సౌత్ జోన్ అంతర్ విశ్వవిద్యాలయాల మహిళల హాకీ టోర్నమెంట్‌లో పాల్గొనే ఏయూ జట్టులో చోటు లభించిందని చెప్పారు. విద్యార్థినులను కళాశాల ప్రిన్సిపాళ్లు, అధ్యాపకులు అభినందించారు.

భూ సమస్యలకు వెంటనే పరిష్కారం

- తహసీల్దార్ నర్సింహమూర్తి

నక్కపల్లి, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చినదొడ్డిగల్లులో సోమవారం రెవెన్యూ సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ నర్సింహమూర్తి మాట్లాడుతూ.. రైతుల భూ సంబంధిత సమస్యలపై ఫిర్యాదులు ఇస్తే వెంటనే పరిష్కరిస్తామని చెప్పారు. సర్పంచ్ చంద్రరావు, వైస్ ఎంపీపీ వెలగా ఈశ్వరరావు, జనసేన మండల అధ్యక్షుడు సుధాకర్, డీటీ అన్నాజీరావు, ఆర్ఐ కన్నబాబు పాల్గొన్నారు.


నక్కపల్లి: చినదొడ్డిగల్లు రెవెన్యూ సదస్సులో అర్జీలు ఆన్‌లైన్ చేస్తున్న దృశ్యం

అచ్యుతాపురంలో..

రెవెన్యూ సమస్యలపై వచ్చిన అర్జీల సత్వర పరిష్కారానికే రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తున్నట్టు తహసీల్దార్ జీవీ జనార్దన్ అన్నారు. సోమవారం నునపర్తి శివారు జీపీ అగ్రహారంలో జరిగిన రెవెన్యూ సదస్సులో ఆయన మాట్లాడుతూ ఇందులో స్వీకరించిన అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించి నిర్ణీత గడువులోగా పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో రెడ్డి నగేష్, గొంప నరసింహనాయుడు, మేడిశెట్టి అప్పలరాజు, మండల సర్వేయర్ జె. రాధ, పోలవరపు నాగరాజు, ఆర్. అప్పలరాజు, కె.ఎర్రినాయుడు, ఎం. కనకఅప్పారావు తదితరులు పాల్గొన్నారు.


అచ్యుతాపురం: రెవెన్యూ సదస్సులో అర్జీలు స్వీకరిస్తున్న దృశ్యం

మునగపాకలో..

దీర్ఘకాలికంగా ఉన్న రెవెన్యూ సమస్యలను పరిష్కరించేందుకు కూటమి ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తోందని స్థానిక తహసీల్దార్ ఆది ఉమామహేశ్వరరావు అన్నారు. సోమవారం అరబుపాలెంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆయన మాట్లాడుతూ.. ఇటుకల బట్టీలకు ఇచ్చిన భూముల రీసర్వే గతంలో జరగలేదని రైతులు ఫిర్యాదు చేయడంతో తహసీల్దార్ మధ్యాహ్నం సర్వేయర్లు, కార్యదర్శిలను పంపి రీ సర్వే చేయించారు. దీంతో రైతులు సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ బొడ్డేడ శ్రీనివాసరావు, రెవెన్యూ సర్వేయర్లు, కార్యదర్శిలు, వీఆర్‌ఏలు, రైతులు పాల్గొన్నారు.

పథకాలను కిశోర బాలికలు సద్వినియోగం చేసుకోవాలి

- ఐసీడీఎస్ సీడీపీఓ కె.శ్రీవిద్య

పాయకరావుపేట, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను కిశోర బాలికలు సద్వినియోగం చేసుకుని అభివృద్ధి సాధించాలని ఐసీడీఎస్ సీడీపీఓ కె.శ్రీవిద్య అన్నారు. సోమవారం స్థానిక స్త్రీశక్తి భవన్‌లో నిర్వహించిన కిశోర వికాసం కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. గ్రామస్థాయిలో కిశోర బాలికలను గుర్తించి, వారికి ఆరోగ్యం, పోషణ, మానసిక ధైర్యం, విద్య తదితర అంశాలపై శిక్షణ ఇస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఎ.జయప్రకాశరావు, ఎంఈఓ-2 రమేష్, ఈవోపీఆర్డీ సీహెచ్.చంద్రశేఖర్, మెడికల్ ఆఫీసర్ స్వరాజ్యం, ఐడీడీఎస్ సూపర్‌వైజర్ సౌజన్య, శిక్షకులు వైవీ.సత్యనారాయణ, మీనా, వైద్య సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు, సచివాలయాల ఉద్యోగులు, కిశోర బాలికలు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న నక్కపల్లి ఐసీడీఎస్ సీడీపీఓ కె.శ్రీవిద్య

కిశోర వికాసంపై శిక్షణ

ఎలమంచిలి: కిశోర బాలికా వికాసంపై సోమవారం పట్టణంలోని ఎంపీడీవో, వెలుగు కార్యాలయాల్లో వేర్వేరుగా శిక్షణ కార్యక్రమాలు నిర్వహించినట్టు ఐసీడీఎస్ పీవో ఇందిర తెలిపారు. బాల్య వివాహాలు, పోక్సో చట్టం, బాలికా విద్య, సాధికారత తదితర అంశాలపై అవగాహన కల్పించినట్టు ఆమె తెలిపారు. అంగన్‌వాడీ, సచివాలయాల సిబ్బంది, పోలీసు, రెవెన్యూ, విద్యాశాఖ అధికారులు పాల్గొని, బాలికా సాధికారిత కోసం పలు సూచనలు చేశామన్నారు. కార్యక్రమంలో పట్టణ ఎస్ఐ సావిత్రి, మండల విద్యాశాఖ అధికారులు మీనాక్షి, అరుణ్‌కుమార్, డీటీ కుమార్, అధికారులు పాల్గొన్నారు.

జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా శైలజ


ప్రిన్సిపాల్ శైలజకు శుభాకాంక్షలు తెలుపుతున్న అధ్యాపకులు, సిబ్బంది

పాయకరావుపేట, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా కె.శైలజ సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకు నక్కపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంగ్లీషు అధ్యాపకురాలిగా పనిచేసిన శైలజ గతంలో ఇక్కడ ఆరు సంవత్సరాలు అధ్యాపకురాలిగా విధులు నిర్వర్తించారు. సోమవారం కళాశాల ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు స్వీకరించిన ఆమెకు నక్కపల్లి జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కె.శ్రీదేవి, పాయకరావుపేట కళాశాల అధ్యాపకులు, సిబ్బంది శుభాకాంక్షలు తెలియజేశారు.

విద్యా సంస్థలు విడిచిపెట్టేటప్పుడు పెట్రోలింగ్ చేయాలి

- పోలీసులకు ఎస్ఎఫ్ఐ నాయకుల విజ్ఞప్తి

పాయకరావుపేట, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో స్కూల్స్, కాలేజీలు విడిచిపెట్టే సమయాల్లో ఆయా ప్రాంతాల్లో పోలీస్ పెట్రోలింగ్ నిర్వహించాలని పలువురు ఎస్ఎఫ్ఐ నాయకులు పోలీసులకు విజ్ఞప్తి చేశారు. సోమవారం ఈమేరకు స్థానిక పోలీస్ స్టేషన్‌లో వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎం.బాలాజీ, ఎం.రమణ మాట్లాడుతూ పట్టణంలో స్కూల్స్, కాలేజీలు విడిచిపెట్టే సమయాల్లో ఆకతాయిలు తిరుగుతూ ఆడపిల్లలను ఇబ్బంది పెడుతున్నారని, మద్యం, మాదకద్రవ్యాలు సేవించి అల్లర్లు, ఆఘాయిత్యాలకు పాల్పడుతున్నారని వాపోయారు. పోలీసులు స్పందించి పెట్రోలింగ్ నిర్వహించి, ఆకతాయిలను కట్టడి చేయాలని విజ్ఞప్తి చేశారు. ఎస్ఎఫ్ఐ నాయకులు జె.శ్రీను పాల్గొన్నారు.

నేడు పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఎస్.రాయవరం, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొరుప్రోలు సబ్‌స్టేషన్ పరిధిలోని పలు ఫీడర్లలో విద్యుత్ లైన్లపై ఉన్న చెట్ల కొమ్మల తొలగింపు, ఇతర మరమ్మతుల నిమిత్తం మంగళవారం ఉదయం పది గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఏపీఈపీడీసీఎల్ అనకాపల్లి ఈఈ రాజశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. అందువల్ల గోకులపాడు, భీమవరం, పెదగుమ్ములూరు, దార్లపూడి, చినగుమ్ములూరు ఆర్‌డబ్ల్యూఎస్, ఎలమంచిలి మండలం ఏటికొప్పాక, చెల్లాపురం, దార్లపూడి గ్రామాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

మాజీ ప్రధాని పీవీకి ఘన నివాళి


పీవీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

ఎలమంచిలి, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): మాజీ ప్రధాని పీవీ. నరసింహారావు 21వ వర్ధంతిని పురస్కరించుకుని స్థానిక పీవీ కాంప్లెక్సు ఆవరణలోని ఆయన విగ్రహానికి విశ్రాంత ఉద్యోగులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. గాయత్రి సేవా ట్రస్ట్ ప్రతినిధి సీహెచ్. సోమేశ్వరరావు, రాచకొండ పట్టాభిరామయ్య, సాంబమూర్తి, కామేశ్వరరావు, వేద పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

రైతులు అప్రమత్తంగా ఉండాలి : ఏఓ


కొత్తపాలెంలో రైతులతో మాట్లాడుతున్న ఏవో మోహనరావు

ఎలమంచిలి, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ కారణంగా మండల రైతాంగం అప్రమత్తంగా ఉంటూ సూచనలను విధిగా పాటించాలని వ్యవసాయాధికారి మోహనరావు అన్నారు. సోమవారం కొత్తపాలెంలో రైతులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరి పంట కోసిన, నూర్పిడి చేయదలచిన రైతులు వాతావరణ పరిస్థితులను అనుసరించి పనులు చేయాలన్నారు. కోత కోసిన రైతులు చిన్న చిన్న కుప్పలుగా వేసుకుని మధ్యలో కళ్ల ఉప్పు వరి ఊకతో కలిపి చల్లుకోవాలన్నారు. కుప్పలు వేసిన రైతులు టార్పాలిన్‌ను వేసి కట్టుకోవాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది అరుణ, రాంబాబు, గణేష్, మహేష్, రైతులు పాల్గొన్నారు.

మానవత్వం చాటుకున్న పూర్వ విద్యార్థులు


బాధితురాలికి నగదు, నిత్యావసర సరకులు అందిస్తున్న దృశ్యం

ఎస్.రాయవరం, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మేజరు పంచాయతీ తిమ్మాపురం జడ్పీ హైస్కూల్ పూర్వ విద్యార్థులు (2007-08)మానవత్వం చాటుకున్నారు. తిమ్మాపురం గ్రామంలో ప్రగడ బాబూజీ కుమార్తె అనారోగ్యంతో బాధపడుతున్నది. వారి పేదరికం విషయం తెలుసుకున్న జనసేన పార్టీ మండల నేత శానాపతి బాబూరావు వాట్సాప్ గ్రూపుల్లో పోస్టు చేయడంతో స్థానిక హైస్కూల్ పూర్వ విద్యార్థులు స్పందించారు. రూ. ఆరు వేల విలువ గల నిత్యావసర సరుకులు, రూ. పది వేలు నగదును సోమవారం బాబూజీ ఇంటికి వెళ్లి బాధితురాలికి అందజేశారు. కార్యక్రమంలో దమ్ము రాజు, టేకు చందు, కట్టా రాజు, జంప శ్రీనివాస్, రాము తదితరులు పాల్గొన్నారు.

'రైతులు విధిగా సూచనలు పాటించాలి'


రైతులకు సూచనలిస్తున్న ఏవో సుమంత

రాంబిల్లి, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): అల్పపీడనం కారణంగా రైతులంతా విధిగా సూచనలు పాటించాలని వ్యవసాయాధికారి సుమంత తెలిపారు. సోమవారం మండలంలోని పలు గ్రామాల్లో ఆమె పర్యటించి రైతులకు సూచనలు చేశారు. రైతులు పొలాల నుంచి నీరు బయటకు పోయేలా చూడాలన్నారు. కోత కోసి పనలు మీద 5 శాతం ఉప్పు ద్రావణంతో పిచికారీ చేయాలన్నారు. ఈ విధంగా చేయడం వల్ల మొలక రాకుండా ఉంటుందని వివరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

పెదపల్లి చెరువు ఆక్రమణపై చర్యలు తీసుకోవాలి

ఎలమంచిలి, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): మునిసిపాలిటీలోని పెదపల్లిలో చెరువు ఆక్రమణపై చర్యలు తీసుకోవాలని తహసీల్దారు వరహాలుకు ఆ ప్రాంతవాసులు బొద్దపు శ్రీనువాసరావు(రమణ), బొద్దపు గణేష్ సోమవారం వినతిపత్రాన్ని అందజేశారు. చెరువులో కొంత భాగం ఇప్పటికే ఆక్రమణకు గురైందని, అధికారులు నిబంధనలు ప్రకారం చర్యలు తీసుకోవాలని కోరారు. హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని కోరారు.

వైసీపీ ప్రభుత్వంలో విద్యా రంగానికి తీవ్ర నష్టం

- ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి రఘువర్మ


సమావేశంలో మాట్లాడుతున్న రఘువర్మ

ఎస్.రాయవరం, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వ హయాంలో విద్యా రంగానికి, ఉపాధ్యాయులకు తీవ్ర నష్టం జరిగిందని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి పాకలపాటి రఘువర్మ అన్నారు. సోమవారం ఆయన మండలంలోని పలు పాఠశాలల్లో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విలేకర్లతో మాట్లాడుతూ గత ప్రభుత్వం ఏమి చెప్పినా వినకుండా 3, 4, 5 తరగతులను తీసుకెళ్లి హైస్కూల్లో కలపడం వంటి కార్యక్రమాల ద్వారా విద్యా వ్యవస్థకు నష్టం కలిగేలా చేసిందన్నారు. కూటమి ప్రభుత్వంలో విద్యాశాఖా మంత్రి లోకేష్‌ను కలిసి 117 జీవోను రద్దు చేయాలని అభ్యర్థించడం జరిగిందన్నారు. గత ప్రభుత్వం వలన నష్టపోయిన విద్యారంగానికి పూర్వవైభవం తీసుకురావాలని కోరామన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు కేకేఎల్ఎన్ ధర్మారావు, మండల అధ్యక్షుడు జి. సునీల్, సెక్రటరీ కె. శ్రీనివాసరావు, ప్రధానోపాధ్యాయులు సుధాకర్, రమేష్, సత్యనారాయణ, కేవీఆర్, పలువురు విశ్రాంత ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అశ్వ వాహనంపై ఆపద్బాంధవుడు


మాఢవీధుల్లో స్వామివారి తిరువీధి సేవ

నక్కపల్లి, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ధనుర్మాసోత్సవాల్లో భాగంగా సోమవారం ఉపమాక క్షేత్రంలో వేంకటేశ్వర స్వామివారి తిరువీధి సేవ కన్నుల పండువగా జరిగింది. ముందుగా ఆలయంలో క్షేత్రపాలకుడు వేణుగోపాలస్వామి, ఉత్సవమూర్తులకు ప్రత్యేక పూజలు, హోమాలు ఆలయ ప్రధానార్చకులు ప్రసాదాచార్యులు, అర్చకులు భాగవతం సాయి గోపాలాచార్యులు, నండూరి గోపాలాచార్యులు, శ్రీనివాసాచార్యులు నిర్వహించారు. అనంతరం అశ్వవాహనంపై ఉభయ దేవేరులతో కూడిన స్వామివారిని, పల్లకీపై గోదాదేవి అమ్మవారిని అలంకరించి మాడవీధుల్లో ఊరేగించారు. కార్యక్రమంలో ఆలయ ఇన్‌స్పెక్టర్ కూర్మేశ్వరరావు,సింగరాచార్యులు, తాతాజీ కృష్ణ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

'మేలుకొలుపులతో ఆరోగ్యం'


అందలాపల్లిలో మేలుకొలుపులు చేస్తున్న దృశ్యం

అచ్యుతాపురం, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఆధ్యాత్మికతతోపాటు ఆరోగ్యానికి మేలుకొలుపులు ఎంతగానో ఉపయోగపడతాయని సమరసత సేవా ఫౌండేషన్ ఎలమంచిలి సబ్‌డివిజన్ కన్వీనర్ బీవీ రమణ అన్నారు. సోమవారం కొండకర్ల, అందలాపల్లి ఆలయాలల్లో మేలుకొలుపులు కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సూర్యోదయం ముందు భగవదారాధన చేసిన వారికి ఆర్థిక ఇబ్బందులు ఉండవన్నారు. ఈకార్యక్రమంలో కొల్లి అప్పారావు, మోహనరావు, రమణ, అప్పారావు, గాంధీ, సూరిఅప్పారావు, సన్యాసిరావు, వెంకునాయుడు, భవానీ, ఆదిలక్ష్మి, రమణ కుమారి, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

సెక్రటరీపై చర్యలు తీసుకోవాలని వినతి


ఎంపీడీవో సీతారామరాజుకు ఫిర్యాదు చేస్తున్న నేతలు

నక్కపల్లి, డిసెంబరు 23: మండలంలోని రాజయ్యపేట పంచాయతీ పూర్వ సెక్రటరీ, అక్రమాలకు పాల్పడ్డారని, అతనిపై చర్యలు తీసుకోవాలంటూ ఆ గ్రామ జనసేన నాయకులు పిక్కి స్వామి, దూడ జగదీశ్ సోమవారం ఎంపీడీవో సీతారామరాజుకు వినతిపత్రం అందజేశారు. సమాచార హక్కు చట్టం ద్వారా దరఖాస్తు చేసుకున్న వారికి తప్పుడు సమాచారమిస్తున్నారని చెప్పారు. అందువల్ల సమగ్ర దర్యాప్తు జరిపి అక్రమాలకు పాల్పడిన సెక్రటరీపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలంటూ ఫిర్యాదు చేశారు.

సబ్సిడీపై కృత్రిమ గర్భధారణ ఇంజక్షన్లు


బీమా చెక్కుని అందజేస్తున్న శేషు

అచ్యుతాపురం, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): తాము కేవలం రూ.50లకే పశువులకు కృత్రిమ గర్భధారణ ఇంజక్షన్లు చేస్తున్నామని హెరిటేజ్ డెయిరీ మేనేజర్ కూండ్రపు శేషు అన్నారు. సోమవారం ఎర్రవరంలో పాడి రైతు ఎస్.వెంకటరామారావుకు పాడి గేదె బీమా రూ.40 వేలను ఆయన అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వెంకటరామరావు పాడి గేదె ఇటీవలే మరణించిందన్నారు. పశువులకే కాకుండా వాటిని పెంచే పాడి రైతులకు కూడా బీమా సౌకర్యాన్ని కల్పిస్తున్నామన్నారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు ఎ. నాగేశ్వరరావు, జి.అప్పారావు, ఎ.రాజారావు, ఎల్.శ్రీను, జి. కొండలరావు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం తనిఖీ


మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న నేతలు

నక్కపల్లి, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): స్థానిక గర్ల్స్ హైస్కూల్‌లో సోమవారం మధ్యాహ్న భోజనాన్ని స్కూల్ కమిటీ చైర్మన్ పెదిరెడ్డి రమేశ్ నేతృత్వంలో టీడీపీ నేతల బృందం తనిఖీ చేసింది. మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనాన్ని పిల్లలకు పెట్టాలని, పరిశుభ్రమైన వాతావరణంలో వంటలు తయారు చేయాలని టీడీపీ మండల అధ్యక్షుడు కొప్పిశెట్టి వెంకటేశ్ చెప్పారు. పాఠశాలకు సంబంధించిన ఏమైనా సమస్యలుంటే చెప్పాలని, హోం మంత్రి అనిత దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మీగడ సత్తిబాబు, అల్లాడ తాతారావు, వీరబాబు, కేవీ సత్యనారాయణ, నడిగట్ల రమణ పాల్గొన్నారు.

సీపీఎం జిల్లా కమిటీలో ఇద్దరికి చోటు


అప్పలరాజు


రాజేశ్

నక్కపల్లి, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): సీపీఎం జిల్లా కమిటీలో మండలానికి చెందిన ఇద్దరు సీపీఎం నేతలకు చోటు లభించింది. ఈనెల 21, 22 తేదీల్లో నర్సీపట్నంలో నిర్వహించిన జిల్లా మహాసభల్లో కొత్త కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈ మేరకు జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడిగా నక్కపల్లికి చెందిన ఎం.అప్పలరాజును నియమించారు. జిల్లా కమిటీ సభ్యుడిగా ఎన్.నర్సాపురం గ్రామానికి చెందిన ఎం.రాజేశ్‌ను నియమించారు.



వినతిపత్రాలను పరిశీలిస్తున్న ఆర్డీవో రమణ

ప్రజా సమస్యల పరిష్కార వేదికలో 21 అర్జీలు

నర్సీపట్నం, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఆర్డీవో వీవీ.రమణ ఆధ్వర్యంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికను నిర్వహించారు. వివిధ సమస్యలపై 21 అర్జీలు అందినట్టు అధికారులు తెలిపారు. పప్పుశెట్టిపాలెంలో ప్రభుత్వం నిర్వహించిన రెవెన్యూ గ్రామసభలకు సమాచారం ఇవ్వలేదని గ్రామ సర్పంచ్ మాకిరెడ్డి విజయలక్ష్మి ఆర్డీవోకు ఫిర్యాదు చేశారు. గ్రామ సర్పంచ్‌గా ప్రొటోకాల్ పాటించకుండా తహసీల్దార్ ఉద్దేశపూర్వంగా సభలు నిర్వహిస్తున్నారని ఆరోపించారు. ఈ మేరకు తహసీల్దార్‌పై చర్యలు తీసుకోవాలని సర్పంచ్ కోరారు.

పవర్ లిఫ్టింగ్‌లో చెట్టుపల్లి విద్యార్థుల సత్తా



పతకాలతో చెట్టుపల్లి జడ్పీహెచ్ పాఠశాల విద్యార్థినులు

నర్సీపట్నం, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): చెట్టుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థినులు రాష్ట్ర స్థాయి పవల్ లిఫ్టింగ్ పోటీలలో సత్తా చాటారు. ఈ నెల 22, 23 తేదీలలో విజయవాడ కృష్ణలంక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగిన అండర్-17 పవర్ లిఫ్టింగ్ పోటీలలో పతకాలు సాధించారు. 53 కిలోల విభాగంలో ఎ.పూర్వజ బంగారు పతకం, 47 కిలోల విభాగంలో ఎం.లక్ష్మీదేవికి సిల్వర్ మెడల్, 69 కిలోల విభాగంలో అమృతవల్లికి కాంస్య పతకం సాధించారని పీడీ జి.శ్రీదేవి తెలిపారు. రాష్ట్ర స్థాయిలో పతకాలు సాధించిన విద్యార్థినులను హెచ్ఎం పీవీ.రామకృష్ణారావు, ఉపాధ్యాయులు అభినందించారు.

సభ్యత్వ నమోదుకు అనూహ్య స్పందన

▸ టీడీపీ పట్టణ అధ్యక్షుడు దేవరపల్లి



సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహిస్తున్న వెంకట అప్పారావు

చోడవరం, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): సభ్యత్వ నమోదు కార్యక్రమానికి అనూహ్య స్పందన లభిస్తున్నదని టీడీపీ పట్టణ అధ్యక్షుడు దేవరపల్లి వెంకట అప్పారావు తెలిపారు. పట్టణంలోని పలు వార్డులలో సోమవారం సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం చంద్రబాబు సారథ్యంలో అమలవుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలకు యువత ఆకర్షితులు అవుతున్నారని, దీంతో పార్టీ పట్ల ఎక్కువ ఉత్సాహం చూపిస్తున్నారని చెప్పారు. కార్యకర్తలకు పార్టీ కల్పిస్తున్న భరోసా, వారి పట్ల చూపిస్తున్న ఆదరణ కారణంగా సభ్యత్వాల నమోదుకు ఎక్కువ శాతం మంది యువత ముందుకు వస్తున్నారన్నారు. ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు సారథ్యంలో సభ్యత్వ నమోదు లక్ష్యం అధిగమిస్తామని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు పాల్గొన్నారు.

చీడిగుమ్మల అభివృద్ధికి రూ.కోటి మంజూరు



కార్యక్రమంలో మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

గొలుగొండ, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): చీడిగుమ్మల గ్రామ పంచాయతీ అభివృద్ధి కోసం కూటమి ప్రభుత్వం వచ్చిన ఆరు నెలల్లోనే రూ.కోటి నిధులు మంజూరు చేసినట్టు ఎంపీటీసీ మాజీ సభ్యుడు భీమిరెడ్డి సత్యనారాయణ తెలిపారు. గ్రామంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్రామ పంచాయతీలో వివిధ అభివృద్ధి పనులు చేపట్టేందుకు స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు ఈ నిధులు కేటాయించారని చెప్పారు. ధూళిపేటలో సిమెంట్ రోడ్డు నిర్మాణానికి రూ.10 లక్షలు, బీసీ కాలనీకి రూ.4 లక్షలు, దళిత కాలనీలో కాలువలు నిర్మాణానికి రూ.10 లక్షలతో పాటు పోలవరానికి, ఎరకంపేటకు మరిన్ని నిధులు మంజూరు చేశారన్నారు. దళిత కాలనీలో అభివృద్ధికి స్పీకర్ సతీమణి పద్మావతి సొంత నిధులు రూ.5 లక్షలు కేటాయించాలరని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో చీడిగుమ్మల టీడీపీ అధ్యక్షుడు కామిరెడ్డి గోవింద, నాయకులు మెండెం శ్రీను, కామిరెడ్డి శ్రీరామ్మూర్తి, తదితరులు పాల్గొన్నారు.

జీవీఎంసీ కాలువకు గండి

▸ పొలాల్లో చేరిన నీరు... మినుము, వరి కుప్పలకు నష్టం





పొలాల్లో చేరిన నీటిలోనే ఉన్న వరి కుప్పలు... (ఇన్‌సెట్‌లో) వావిలపాడు వద్ద జీవీఎంసీ కాలువ పడిన రంధ్రం

దేవరాపల్లి, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఉరిమి ఉరిమి మంగళం మీద పడిందన్న చందంగా తయారైంది నాగయ్యపేట, వావిలపాడుకు చెందిన పంట పొలాల్లోని రైతుల పరిస్థితి. జీవీఎంసీ కాలువకు వావిలపాడు కళ్లాల వద్ద గండి పడడంతో పంట పొలాలు నీటిమయమయ్యాయి. తుఫాను హెచ్చరికలతో రైతులు కోసిన వరి పనలు కుప్పలు వేయడానికి సోమవారం వెళ్లడంతో విజయనగరం జిల్లా వేపాడ మండలం వావిలపాడు గండి వారి కళ్లాల వద్ద రైవాడ జలాశయం నుంచి జీవీఎంసీకి సరఫరా అయ్యే కాలువకు రంధ్రం పడింది. దీంతో పొలాల్లో వేసిన వరి కుప్పలు, ఎండ బెట్టిన వరి పనలు, మినుము పంటలు సుమారు వంద ఎకరాల వరకు నీట మునిగాయి. దీన్ని కాపాడుకోవడానికిరైతులు పరుగులు తీశారు. నీటి ప్రవాహం ముందు రైతుల పరుగులు ప్రయోజం లేకపోవడంతో జీవీఎంసీ కాలువ వద్దకు వెళ్లారు. జీవీఎంసీ పర్యవేక్షకులు పోలినాయుడు, సిబ్బంది, రైతులతో కలిసి గండిని పూడ్చారు. ఇలాంటి గండ్లు లేకుండా చూడాలని రైతులు కోరుతున్నారు.

కలిసొచ్చిన రెవెన్యూ సదస్సులు

కూటమి ప్రభుత్వం నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులు రైతులకు ఎంతో ఉపయుక్తంగా ఉన్నాయి. ఎన్నో ఏళ్లుగా పరిష్కారానికి నోచుకోని భూముల సమస్యలు ఈ సదస్సులతో కొలిక్కి వస్తున్నాయి. ప్రధానంగా ఏపీఐఐసీ రికార్డుల్లో నమోదైన భూములకు రెవెన్యూ సదస్సుల పుణ్యమాని దశాబ్దం తర్వాత మోక్షం లభించడం విశేషం. దీంతో కూటమి ప్రభుత్వంపై రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఏపీఐఐసీ రికార్డుల్లో నమోదైన జిరాయితీ భూములకు మోక్షం

▸ బ్లాక్‌ల వారీగా భూ సమస్యలకు పరిష్కారం

▸ కూటమి ప్రభుత్వంపై బాధిత రైతుల హర్షం

మాకవరపాలెం, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాచపల్లి, జివెంకటాపురం, జి.కోడూరు, తామరం తదితర గ్రామాల్లో అన్‌రాక్ కంపెనీ 2,400 ఎకరాల భూసేకరణ చేసింది. భూ సేకరణ అనంతరం రైతులకు మిగులు ఉన్న మరో 500 ఎకరాల జిరాయితీ భూమిని కూడా ఏపీఐఐసీ రికార్డుల్లో నమోదు చేసింది. దీంతో గత పదేళ్లుగా ఈ భూములు రైతుల పేరు మీద ఆన్‌లైన్ కావడం లేదు. దీంతో రైతులు అధికారులు, ప్రజాప్రతినిధులకు మొరపెట్టుకున్నా ఫలితం లేకుండా పోయింది. వైసీపీ ప్రభుత్వ హయాంలో రైతులు భూములు ఆన్‌లైన్ చేశామని పలుమార్లు ప్రకటనలు చేసి చివరకు రాచపల్లి గ్రామంలో భూ రీ సర్వే లేకుండా చేశారు. దీంతో రైతులు ప్రభుత్వం అందించే రాయితీ రుణాలు, రైతు భరోసా వంటి పథకాలు నిలిచిపోయాయి. అలాగే పిల్లల అవసరాలకు కూడా బ్యాంకుల నుంచి రుణాలు తెచ్చుకోలేని దుస్థితి బాధిత రైతులకు దాపురించింది.

చివరకు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రీ సర్వేలో జరిగిన తప్పిదాలతో పాటు భూముల సమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తుండడం రైతులకు కలిసి వచ్చింది. రాచపల్లిలో ఈ నెల 13వ తేదీన నిర్వహించిన రెవెన్యూ సదస్సులో రైతులు ఏపీఐఐసీ రికార్డుల నుంచి తమ భూములను తొలిగించాలని దరఖాస్తులు చేసుకున్నారు. దీనిపై నర్సీపట్నం ఆర్డీవో వీవీ.రమణ, తహసీల్దార్ రామారావు ప్రత్యేకదృష్టి సారించి ఏపీఐఐసీ రికార్డుల జాబితాలను సిద్ధం చేశారు. ప్రస్తుతం నాలుగు బ్లాక్‌లలో ఉన్న రైతుల జాబితాలను తయారు చేయాలని రెవెన్యూ సిబ్బందికి ఆదేశించారు. నెల రోజుల్లో దశల వారీగా రాచపల్లితో పాటు మిగిలిన గ్రామాలకు చెందిన రైతుల భూములు ఏపీఐఐసీ రికార్డుల నుంచి తొలిగిస్తామని తహసీల్దార్ తెలిపారు. దీంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ మేరకు కూటమి ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలుపుతున్నారు.



రాచపల్లిలో ఏపీఐఐసీ రికార్డుల్లో నమోదైన జిరాయితీ భూములు

ఇప్పటికి మోక్షం కలిగింది



-రుత్తల సత్యనారాయణ, రైతు, రాచపల్లి

పదేళ్లుగా రెవెన్యూ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నాం. ఎప్పటికీ పని జరగకపోవడంతో విసుగు వచ్చేసింది. కూటమి ప్రభుత్వం నిర్వహించిన రెవెన్యూ సదస్సు ద్వారా మా గ్రామానికి న్యాయం జరుగుతుందని అధికారులు చెప్పారు. సదస్సులో దరఖాస్తు చేసుకోవడంతో ఇప్పటికి మోక్షం కలిగింది. బ్లాకుల వారీగా జాబితాలు తయారు చేయడం ఎంతో శుభపరిణామం.

రెవెన్యూ సదస్సులతో మోక్షం



-అడిగర్ల రమణ, రైతు, రాచపల్లి

ప్రభుత్వం నిర్వహించిన రెవెన్యూ సదస్సు మాకు ఎంతో కలిసి వచ్చింది. చాలా నెలల నుంచి భూములకు రికార్డుల లేక బాధలు పడుతున్నాం. కూటమి ప్రభుత్వం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో దరఖాస్తులు అందించాం. ప్రస్తుతం అధికారులు ఏపీఐఐసీ రికార్డుల నుంచి భూములు తొలిగించేందుకు బ్లాకుల వారీగా రైతులు జాబితాలు తయారు చేస్తున్నారని తెలియడంతో ఎంతో ఆనందపడుతున్నాం.





మాకవరపాలెంలో కుప్పలు వేసేందుకు పనలు మోస్తున్న రైతులు... గర్నికం పొలాల్లో కుప్పలు వేస్తున్న రైతు కుటుంబం

అల్పపీడనం.. వరి పంటకు గండం

పొలాలకు పరుగులు తీస్తున్న రైతులు

ఆదరాబాదరాగా మడుల్లోనే వరి కుప్పలు

మాకవరపాలెం, డిసెంబర్ 23 (ఆంధ్రజ్యోతి): మరో అల్పపీడనం ఏర్పడిందన్న సమాచారంతో అన్నదాతలు ఆందోళనకు గురవుతున్నారు. సోమవారం మళ్లీ ఒక్కసారిగా వాతావరణంలో మార్పులు రావడంతో లబోదిబోమంటున్నారు. వరి పంటను కాపాడుకోవడానికి ఉదయం ఏడు గంటలకే పొలాలకు పరుగులు పడుతున్నారు. ఇప్పటికే కోత కోసిన వరి పనలను మడుల్లోనే కుప్పలు పెడుతున్నారు. మండలంలోని మాకవరపాలెం, తామరం, కొండలఅగ్రహారం, పైడిపాల తదితర గ్రామాల్లో వరి చేను కుప్పలు వేసేందుకు రైతులు నానా ఇబ్బందులు పడ్డారు. ఈ ఏడాది వరి పంటబాగా పండినప్పటికీ, చివరి దశలో తెగుళ్లు పీడించాయని, ఇప్పుడు వరుస తుఫాన్‌లు కలవరం రేపుతున్నాయని రైతులు గగ్గోలు పెడుతున్నారు. పంట దిగుబడిపై వారు భయాందోళనకు గురువుతున్నారు.

రావికమతంలో...

రావికమతం: తుఫాన్ తగ్గినట్టే తగ్గి.. మరలా రావడంతో వరి పంటకు గండం తప్పడంలేదని రైతులు ఆందోళన చెందుతున్నారు. మండలంలోని పలు గ్రామాలలో కోతలు కోసిన వరిపై తుఫాన్ నీళ్ల జల్లింది. భారీ వర్షాలకు నానిపోయి కోత కోసిన వరి ఇప్పటికే మొలకలొచ్చేశాయి. ఆరుగాలం శ్రమించి పండించిన పంట చేతికందే సమయంలో తుఫాన్ వర్షం నీటి పాలు చేసిందని రైతులు వాపోతున్నారు. నాలుగు రోజులుగా తుఫాన్ వర్షాల కారణంగా కల్యాణపులోవ రిజర్వాయర్ కింద ఆయకట్టు భూముల్లో పలు లోతట్టు ప్రాంతాల్లో ఇంకా నీరు వీడక కోసిన వరి పనలు నీటిలో నాని మొలకలు వస్తున్నాయి. ఆదివారం తుఫాన్ ప్రభావం తగ్గి వాతావరణం కాస్త పొడిగా ఉండి ఎండకాసింది. దీంతో మొలకలొచ్చినా సగం పంటైనా దక్కుతుందన్న ఆశతో మడులపై వర్షానికి తడిచిన పనలను ఆరబెట్టారు. సోమవారం మళ్లీ వాతావరణం మారిపోయి చినుకులు రాలడంతో మడులపై ఉన్న వరి పంటను కాపాడుకోవడానికి పరుగులు తీస్తున్నారు. తుఫాన్ ప్రభావం గురువారం వరకు ఉంటుందని వాతావరణ శాఖ తెలపడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ ఏడాది పంట బాగా పండినా చేతికందే సమయంలో తుఫాన్ పట్టి పీడిస్తున్నాయని రైతులు వాపోతున్నారు.

మార్కెట్ విలువ పెంపుపై అభ్యంతరాలు తెలపాలి

కె.కోటపాడు, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): భూములు, ఆస్తుల విలువ పెంపుపై మంగళవారంలోగా అభ్యంతరాలను తెలపాలని జిల్లా రిజిస్ట్రార్ కె.మన్మథరావు తెలిపారు. స్థానిక సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని సోమవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థిరాస్తులపై సవరించిన మార్కెట్ విలువ ప్రతీ సబ్ రిజిస్ట్రార్ వారి కార్యాలయం నోటీసు బోర్డులోనూ అతికించినట్టు చెప్పారు. వాటిపై ఏమైనా అభ్యంతరాలు ఉంటే మంగళవారంలోగా తెలియజేయవచ్చని మన్మథరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో సబ్ రిజిస్ట్రార్ కె.సత్యనారాయణమూర్తి, సీనియర్ అసిస్టెంట్ ఎర్రినాయుడు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రైవాడ జలాశయ ప్రాజెక్టు కమిటీ చైర్మన్ పాత్రునాయుడుకు అభినందనలు

దేవరాపల్లి, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి ఎంపీ సీఎం.రమేశ్‌ను రైవాడ జలాశయ చైర్మన్ పోతల పాత్రునాయుడు, మాజీ ఎంపీపీ కిలపర్తి బాస్కరరావు సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పాత్రునాయుడును అభినందించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ పెద్దాడ వెంకటరమణ, ఎంపీటీసీ సభ్యుడు కృష్ణమూర్తి, బందం అప్పలరాజు, దీవిశంకరు, చిటిమిరెడ్డి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

వరి కోతలు వాయిదా వేసుకోండి

చీడికాడ, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున రైతులు వరి కోతలను వాయిదా వేసుకోవాలని మండల వ్యవసాయాధికారి ఎ.కృష్ణవేణి సూచించారు. మండలంలోని తునివలస, దండిసురవరం గ్రామాల్లో పొలాలను సిబ్బందితో కలిసి సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో 3282 హెక్టార్లలో వరినాట్లు వేశారని చెప్పారు. పంట చేతికి వచ్చే వరకూ సకాలంలో వర్షాలు కురుస్తున్నప్పటికీ తుఫాన్‌ల వల్ల రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇప్పటికే 80 శాతం వరి కోతలు పూర్తయ్యాయన్నారు. మిగతా 20 శాతం ఇప్పటికే కోసిన వరి పనలను పొలాల్లో కుప్పలు ఏర్పాటుచేసుకోవాలని సూచించారు. అలాగే పొలాల్లో ఎక్కువగా నీరు ఉంటే కాలువల ద్వారా బయటకు పంపించాలని ఆమె సూచించారు.

శివశక్తి ఆలయానికి మైక్‌సెట్ వితరణ

నాతవరం, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిక్కుడుపాలెం గ్రామంలో శివశక్తి ఆలయానికి జనసేన పార్టీ నర్సీపట్నం నియోజకవర్గ ఇన్‌చార్జి రాజాన వీరసూర్యచంద్ర సోమవారం మైక్‌సెట్‌ను వితరణ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ శివాలయం అభివృద్ధికి మరింత సహకారం అందిస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త సీతారామశర్మ, జనసేన పార్టీ మండల అధ్యక్షుడు వెలగల వెంకటరమణ, టీడీపీ నాయకులు వెలగా కృష్ణారావు, మాకిరెడ్డి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోండి

నాతవరం, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): దీర్ఘకాలిక రోగాలతో బాధపడుతున్న వారి ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని తాండవ ప్రాజెక్టు కమిటీ చైర్మన్ కరక సత్యనారాయణ సూచించారు. గొలుగొండపేట గ్రామంలో సోమవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడుతూ సమాజంలో ప్రతి ఒక్కరూ ఏదో ఒక ఆరోగ్య సమస్యతో బాధపడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అందువల్ల మొదటిలోనే పరీక్ష చేయించుకుని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. డాక్టర్ శివప్రకాష్ మాట్లాడుతూ బీపీ, షుగర్, ఇతర రోగాలు ఉన్నవారు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మిరపల వెంకటరమణ, ఎంపీటీసీ సభ్యుడు తమరాన సత్యనారాయణ, డాక్టర్ కృష్ణ, డాక్టర్ శివప్రసాద్ పాల్గొన్నారు.

డిప్యూటీ సీఎం దృష్టికి నియోజకవర్గ సమస్యలు




పవన్ కల్యాణ్‌కు పుస్తకాలు అందిస్తున్న రాజు

చోడవరం, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో ప్రధాన సమస్యలను డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ దృష్టికి తీసుకువెళ్లినట్టు జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి పీవీఎస్ఎన్ రాజు సోమవారం తెలిపారు. రావికమతం మండలం చలిసింగం గ్రామానికి రోడ్డు నిర్మాణానికి అటవీ శాఖ అవరోధాలు తొలగించాలని, ఈ రహదారి నిర్మాణం పూర్తయితే డోలీ మోతలు తప్పుతాయని వివరించామన్నారు. దీనికి డిప్యూటీ సీఎం సానుకూలంగా స్పందించారన్నారు. చాకిపల్లి రామజోగిపాలెం ప్రజలు పెద్దేరు నదిపై వంతెన సమస్యను వివరించామన్నారు. ప్రముఖ రచయిత ధర్మపాల్ రచించిన పుస్తకాలను డిప్యూటీ సీఎంకు రాజు అందించారు.

రెవెన్యూ సమస్యలపై రైతులు మొర

నాతవరం, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సదస్సులో సమస్యలపై రైతులు మొరపెట్టారు. ఈసారైనా సమస్యలు పరిష్కరించాలని అధికారులను వేడుకున్నారు. రీ సర్వే డిప్యూటీ తహసీల్దార్ శివ ఆధ్వర్యంలో మండలంలోని గొలుగొండపేట గ్రామంలో సోమవారం రెవెన్యూ సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా గొలుగొండపేట రైతులు తమ భూమిని వేరే రైతుల పాసు పుస్తకంలో నమోదు చేశారని, ఈ తప్పులను సరిచేయాలని కోరారు. అలాగే మరికొందరు రైతులు తమకు పట్టాదారు పాసుపుస్తకం ఉన్నప్పటికీ ఆన్‌లైన్ కాలేదని తెలిపారు. దీంతో రైతుభరోసా డబ్బులు పడడం లేదని తెలిపారు. తాండవ ప్రాజెక్టు కమిటీ చైర్మన్ కరక సత్యనారాయణ, వీఆర్వో సిహెచ్.రామకృష్ణ పాల్గొన్నారు.

ఏయూ హాకీ జట్టుకు నక్కపల్లి విద్యార్థినుల ఎంపిక



ఏయూ హాకీ జట్టుకు ఎంపికైన నక్కపల్లి డిగ్రీ కళాశాల విద్యార్థినులు

నక్కపల్లి, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన నలుగురు విద్యార్థినులు ఏయూ హాకీ జట్టుకు ఎంపికైనట్టు ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.శివయ్య తెలిపారు. తమ కళాశాలకు చెందిన కె.జ్యోతిశ్రీ, కె.వరలక్ష్మి, షేక్ హుస్సేన్ బీబీ, డి.కౌసల్య ఈ నెల 26వ తేదీ నుంచి తమిళనాడులోని భారతిదాసన్ విశ్వవిద్యాలయంలో నిర్వహించే సౌత్ జోన్ అంతర్ విశ్వవిద్యాలయాల మహిళల హాకీ టోర్నమెంట్‌లో పాల్గొనే ఏయూ జట్టులో చోటు లభించిందని చెప్పారు.

తాళ్లపాలెం 'గురుకులం'లో సొసైటీ కార్యదర్శి తనిఖీ



స్టోర్‌రూమ్‌ను పరిశీలిస్తున్న ప్రసన్న వెంకటేశ్

కశింకోట, డిసెంబర్ 23 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని తాళ్లపాలెంలో ఉన్న డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ గురుకుల పాఠశాలను ఏపీ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇనిస్టిట్యూషనల్ సొసైటీ కార్యదర్శి వి.ప్రసన్న వెంకటేశ్ సోమవారం తనిఖీ చేశారు. విశాఖపట్నం నుంచి విజయవాడ వెళుతూ.. మార్గ మధ్యలో ఉన్న తాళ్లపాలెం గురుకుల పాఠశాలను సందర్శించారు. విద్యార్థుల వసతి సదుపాయం, మెనూ అమలు తీరు గురించి ఆరా తీశారు. స్టోర్ రూమ్‌లో సరకులు, రికార్డులను తనిఖీ చేశారు. ఏటీఎల్ ల్యాబ్, మరుగుదొడ్లను పరిశీలించారు. టీచర్స్ లెర్నింగ్ మెటీరియల్ గురించి ప్రిన్సిపాల్ గ్రేస్‌ను అడిగి తెలుసుకున్నారు. విద్యా ప్రమాణాల పెంపు, విద్యార్థుల సంక్షేమానికి సంబంధించి ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. ఆయన వెంట ఉమ్మడి జిల్లాల కో-ఆర్డినేటర్ ఎస్.రూపవతి ఉన్నారు.

రెండు గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు

రోలుగుంట, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రత్నంపేట, పనసలపాడు గ్రామాల్లో సోమవారం రెవెన్యూసదస్సులు నిర్వహించారు. రత్నంపేట సచివాలయం వద్ద తహసీల్దార్ నాగమ్మ పాల్గొని రైతుల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పరిష్కారం కాని భూ సమస్యలపై రైతులు ఈ సదస్సుల్లో అర్జీలను అందిస్తే పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. గతంలో జరిగిన రీ సర్వేలో జరిగిన తప్పులు సరిచేసుకోవడానికి ఈ సదస్సులు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. అనంతరం ఆయా గ్రామాలకు సంబంధించి వివిధ భూ సమస్యలపై 31 దరఖాస్తులు వచ్చినట్టు రెవెన్యూ అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ రామమూర్తి, వీఆర్వో అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

ఐటీడీఏ ఏర్పాటుచేయాలి

నర్సీపట్నం, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): మైదాన ప్రాంత గిరిజనుల కోసం నర్సీపట్నంలో ఐటీడీఏని ఏర్పాటు చేయాలని గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లో సురేంద్ర ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. నాన్ షెడ్యూల్ ఏరియాలో ఉన్న గిరిజన గ్రామాలను ఐదో షెడ్యూల్‌లో కలపాలన్నారు. అదానీ హైడ్రో పవర్ ప్రాజెక్టును రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. గిరిజన ప్రాంతాలలో విద్య, వైద్యం, మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయాలని ఈ సందర్భంగా ప్రభుత్వాన్ని కోరారు.

ఘనంగా ఐక్య క్రిస్మస్ వేడుకలు

నర్సీపట్నం, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 22 వార్డు వెంకునాయుడుపేట ప్రాథమిక పాఠశాలలో సోమవారం ఐక్య క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. పలువురు విద్యార్థులు క్రిస్మస్ తాత వేషధారణలో హాజరయ్యారు. హెచ్ఎం డీజీనాథ్ విద్యార్థులతో కేక్ కట్ చేయించి స్వీట్లు పంచారు.

కృష్ణాదేవిపేట: ఏఎల్‌పురంలో ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలల్లో సోమవారం క్రిస్మస్ వేడుకలు జరుపుకున్నారు. పాఠశాలల్లో విద్యార్థులు ఆటపాటలతో అలరించారు. సెంటాన్స్ స్కూల్‌లో సర్పంచ్ లోచల సుజాత తదితరులు పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు చదువుల్లో రాణించాలని ఆమె కోరారు.

స్వయం ఉపాధి కల్పనకు వృత్తి విద్యా కోర్సులు

దేవరాపల్లి, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): స్వయం ఉపాధి కల్పించడానికి వృత్తి విద్యా కోర్సుల్లో టెన్త్, ఇంటర్ విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నామని తెనుగుపూడి అంబేడ్కర్ గురుకుల కళాశాల ప్రిన్సిపాల్ పాంగి రఘు తెలిపారు. శిక్షణ పొందిన విద్యార్థులకు సోమవారం సర్టిఫికెట్‌లను పంపిణీ చేశారు. 2016 నుంచి సమగ్ర శిక్ష ద్వారా పరీక్ష ఫీజులు చెల్లించిన పదో తరగతి, ఇంటర్ విద్యార్థులకు బ్యాచ్‌లు వారీగా పరీక్షలు నిర్వహించి వృత్తి విద్యా కోర్సుల్లో శిక్షణ ఇస్తున్నట్టు చెప్పారు. అనంతరం బోర్డు ఆఫ్ సెకెండరీ ఎడ్యుకేషన్ నుంచి జారీ చేసిన సర్టిఫికెట్ అందిస్తున్నామన్నారు. ఉద్యోగ, వృత్తి విద్యా పరమైన వ్యాపారాలకు స్వశక్తితో జీవనం సాగించడానికి ఇవి ఉపయోగపడతాయని చెప్పారు. వృత్తి విద్యా కోర్సుల ట్రైనీలు డి.లక్ష్మణరావు, ఎల్.అరుణ పాల్గొన్నారు.

వాకర్స్ క్లబ్ కార్యవర్గం

చోడవరం, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని లక్ష్మీపురం రోడ్ వాకర్స్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులుగా రాంబాబు, జగ్గారావు ఎన్నికయ్యారు. అడ్డూరు గ్రామంలో ఆదివారం నిర్వహించిన వాకర్స్ క్లబ్ సభ్యుల సమావేశంలో క్లబ్ అధ్యక్షుడిగా ఓరుగంటి రాంబాబు, కార్యదర్శిగా జాజుల జగ్గారావు, కోశాధికారిగా తటపర్తి సూరిబాబు ఎన్నికయ్యారు. ఈ ఎన్నికలను న్యాయవాది కె.డేవిడ్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో క్లబ్ సభ్యులు పసుమర్తి సంతోశ్ గుప్తా, కోకా రాంబాబు పాల్గొన్నారు.

జన్నవరంలో మొక్కలు నాటే కార్యక్రమం

చోడవరం, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జన్నవరం పాఠశాల ఆవరణలో సోమవారం మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. పాఠశాల తల్లిదండ్రుల కమిటీ, ఉపాధ్యాయులు, గ్రామ పెద్దల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేపట్టారు. ఎంఈవో కె.సింహాచలం, సీఆర్‌పీ కేవీఎం నాయుడు, సర్పంచ్ కె.సన్యాసిరావు, పాఠశాల కమిటీ ప్రతినిధులు కె.నరసింహారావు, ఎస్.నరసింహమూర్తి, హెచ్ఎం చిరంజీవి, అంగన్‌వాడీ కార్యకర్తలు, విద్యార్థులు పాల్గొన్నారు.

గ్రామాల్లో వైద్య శిబిరాలు

మాడుగుల రూరల్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలో పలు గ్రామాల్లో సోమవారం వైద్య శిబిరాలు ఏర్పాటు చేసినట్టు కేజేపురం భానోదయ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ చైర్మన్ రాపేటి రామకొండారావు తెలిపారు. ఆయా గ్రామాల నుంచి 56 మందిని పలు ఆరోగ్య పరీక్షల కోసం వైద్యులు ఎంపిక చేశారని, వారిని ప్రత్యేక బస్సులో తగరపువలసలోని కార్పొరేట్ ఆస్పత్రికి తరలించామని చెప్పారు. వారిలో ఆపరేషన్‌లు అవసరమైన వారికి ఉచితంగా ఆపరేషన్లు చేసి పంపిస్తారని ఆయన తెలిపారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ సభ్యులు చెట్టి కొండలరావు, దేముళ్లు, సిబ్బంది పాల్గొన్నారు.

కిలో కాఫీ గింజలు రూ.500కు కొనాలి

ఏపీ గిరిజన కాఫీ రైతు సంఘం నాయకుడు పాలికి లక్కు



కాఫీ తోటలను పరిశీలిస్తున్న పాలికి లక్కు

పాడేరురూరల్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): మన్యం కాఫీకి జీసీసీ ప్రకటించిన కిల్లో కాఫీ రూ.320 రేటు గిట్టుబాటు ధర కాదని, కిలో కాఫీకి రూ.500 గిట్టుబాటు ధర కల్పించాలని ఏపీ గిరిజన కాఫీ రైతు సంఘం జాతీయ నాయకుడు పాలికి లక్కు డిమాండ్ చేశారు. సోమవారం ఆయన మాట్లాడుతూ ఇటీవల జీసీసీ చైర్మన్ కిడారి శ్రావణ్‌కుమార్ ప్రకటించిన కాఫీ రేటు రైతులకు గిట్టుబాటు కాదన్నారు. అంతర్జాతీయంగా చూస్తే కాఫీ రేటు భారీగా పెరిగిందన్నారు. కిలో పార్చిమెంట్ కాఫీ రూ. 450 నుంచి రూ. 500 వరకు ప్రైవేటు వ్యాపారులు, అదేవిధంగా దళారులు రూ. 350 నుంచి రూ. 400లకు గ్రామాలకు వచ్చి రైతుల నుంచి కొనుగోలు చేస్తున్నారన్నారు. దాని ఆధారంగా రేట్లు పెంచాలన్నారు. ఐటీడీఏ, జీసీసీ, అపెక్స్ కమిటీ కాఫీ రైతులకు గిట్టుబాటు ధర కల్పించేందుకు కృషి చేయాలన్నారు. కిలో కాఫీకి రూ. 500, కిలో చెర్రీకి రూ. 300, కిలో కాఫీ పండ్లకు రూ.100 చొప్పున గిట్టుబాటు ధర పెంచాలని డిమాండ్ చేశారు.

కూటమి ప్రభుత్వ హయాంలో గ్రామాల అభివృద్ధి

» జీసీసీ మాజీ చైర్మన్ ఎంవీవీ ప్రసాద్



రోడ్డు, డ్రైనేజీలకు శంకుస్థాపన చేస్తున్న ప్రసాద్, తదితరులు

కొయ్యూరు, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన ఆరు నెలల్లోనే గ్రామాలలో కోట్లాది రూపాయలతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని జీసీసీ మాజీ చైర్మన్ ఎంవీవీ ప్రసాద్ అన్నారు. మంగళవారం మండలంలోని అంతాడ పంచాయతీ కొత్తపల్లి గ్రామంలో రూ.22 లక్షలతో చేపట్టనున్న సీసీ రోడ్డు, డ్రైనేజీ నిర్మాణాలకు ఆయన శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు ఇరవాడ సత్యవతి, సర్పంచ్ సుర్ల చంద్రరావు, నేతలు కాకురు చంద్రరావు పాల్గొన్నారు.

రబీ ప్రత్యామ్నాయ పంటల సాగుపై రైతులు దృష్టి సారించాలి : ఏవో

చింతపల్లి, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): గిరిజన రైతులు రబీ ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి సారించాలని స్థానిక వ్యవసాయాధికారి శ్రీనివాసరావు అన్నారు. సోమవారం పెద్దబరడలో రబీలో సాగు చేసుకునే పంటలపై రైతులకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గిరిజన ప్రాంతంలో రైతులు రబీలో పంట పొలాలను ఖాళీగా విడిచిపెట్టకుండా నీటి సదుపాయం ఉంటే వరి, మొక్కజొన్న, వేరుశనగ, కూరగాయల పంటలను సాగు చేసుకోవాలన్నారు. వర్షాధారంగా పెసర, మినుము, ఉలవులు నాట్లు వేసుకోవాలన్నారు. రైతులు సచివాలయంలోనున్న వ్యవసాయ, ఉద్యాన సహాయకులకు గాని, వ్యవసాయ అధికారిని గాని సంప్రదించవచ్చునన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన



సీసీ రోడ్డు పనులకు శంకుస్థాన చేస్తున్న సర్పంచ్ పార్తిమ

ముంచంగిపుట్టు, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జర్జుల పంచాయతీ కేంద్రంలో సోమవారం సీసీ రోడ్డు నిర్మాణ పనులకు సర్పంచ్ పార్తిమా శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.3 లక్షలు వెచ్చించి 60 మీటర్ల సీసీ రోడ్డు పనులు చేయించడం జరుగుతుందని చెప్పారు. గ్రామాల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీలు, తాగునీటి బోర్లు ఏర్పాటుపై ప్రత్యేక దృష్టిసారించామన్నారు. దశలవారీగా పంచాయతీ పరిధిలోని గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పిస్తామని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ సాధురాం, ఇంజనీరింగ్ అసిస్టెంట్ నరసింగరావు, వైసీపీ నాయకులు రాంబాబు, చందరరావు, జోగారావు పాల్గొన్నారు.

తెలుగు ఉపాధ్యాయుడు అప్పలస్వామి సేవలు ప్రశంసనీయం



అప్పలస్వామి మాస్టారును సత్కరిస్తున్న ప్రిన్సిపాల్, సిబ్బంది

పెదబయలు, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని సెయింట్ ఆన్స్ పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయునిగా గుండా అప్పలస్వామి అందించిన సేవలు ప్రశంసనీయమని ప్రిన్సిపాల్ సిస్టర్ నిర్మలా ఆన్ తెలిపారు. అప్పలస్వామి 25 సంవత్సరాల సర్వీసు పూర్తి చేసుకున్న సందర్భంగా సోమవారం సత్కరించారు. ఈ సందర్భంగా విద్యార్థులు, ఉపాధ్యాయులు సంప్రదాయ నృత్యాలతో సందడి చేశారు. అనంతరం ప్రిన్సిపాల్ మాట్లాడుతూ అప్పలస్వామి సేవలను ఎప్పుడూ గుర్తుంచు కుంటామని చెప్పారు.

27న రాష్ట్ర వాలీబాల్ జట్ల ఎంపిక

అనకాపల్లి టౌన్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): విజయవాడలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో ఈ నెల 27న జరిగే రాష్ట్ర, స్త్రీ పురుషుల వాలీబాల్ జట్ల ఎం పికకు ఆసక్తి గల క్రీడాకారులు హాజరు కావాలని జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ అధికారి రమణ సోమవారం ఒక ప్రకటనలో కోరారు. ఇక్కడ ఎంపికైన జట్లు రాజస్థాన్ రాష్ట్రం జైపూర్‌లో జనవరి ఏడు నుంచి 13వ తేదీ వరకు జరగనున్న సీనియర్ జాతీయ వాలీబాల్ పోటీలకు హాజరవు తారని వివరించారు. రాష్ట్ర జట్టు ఎంపికకు సంబంధించి క్రీడాకారులు ఈ నెల 27వ తేదీ ఉదయం ఏడు గంటలకు ఆధార్‌కార్డు, నేటివిటీ సర్టిఫికేట్, పది పాస్‌పోర్టు సైజు ఫొటోలతో విజయవాడలోని వాలీబాల్ కోర్టుకు హాజరుకావాలని పేర్కొన్నారు.

'హిట్ అండ్ రన్' బాధితుకుల న్యాయం చేయాలి

» జిల్లా కలెక్టర్ ఏఎస్.దినేశ్‌కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ దినేశ్‌కుమార్

పాడేరు, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): గుర్తు తెలియని వాహనాలు (హిట్ అండ్ రన్) ఢీకొని మృతి చెందిన వారి కుటుంబాలకు న్యాయం చేసేందుకు అధికారులు కృషిచేయాలని జిల్లా కలెక్టర్ ఏఎస్.దినేశ్‌కుమార్ సూచించారు. కలెక్టరేట్‌లో వివిధ శాఖల అధికారులతో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ముఖ్యంగా హిట్ అండ్ రన్ కేసుల్లో మృతి చెందిన వారి కుటుంబానికి రూ. 2లక్షలు, శాశ్వత వైకల్యం పొందిన వారికి రూ.50 వేలు ప్రభుత్వం నుంచి నష్టపరిహారం అందుతుందన్నారు. ఆయా కేసుల్లోని బాధితులకు నష్టపరిహారం పొందే అవకాశముందని ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. అలాగే హిట్ అండ్ రన్ కేసుల్లో బాధితులు పోలీసులు, అధికారులను ఎలా సంప్రదించాలనేది అవగాహన కల్పించాలన్నారు. ఈకార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ అభిషేక్‌గౌడ, సబ్‌కలెక్టర్ శార్యమన్‌పటేల్, జిల్లా రవాణాధికారి లీలాప్రసాద్, డీఎస్‌పీ కెప్రమోద్, డీఎంహెచ్‌వో జమాల్ బాషా, జీవితా బీమా సంస్థల అధికారులు పాల్గొన్నారు.

అందరికీ ఏసుక్రీస్తు ఆశీస్సులు : కలెక్టర్

» పాడేరులో ఘనంగా ముందస్తు క్రిస్మస్ వేడుకలు



కేకు కట్ చేసి చిన్నారికి తినిపిస్తున్న కలెక్టర్ దినేశ్‌కుమార్

పాడేరు, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): ప్రపంచానికి శాంతి సందేశం అందించిన ఏసుక్రీస్తు ఆశీస్సులు అందరిపై ఉండాలని జిల్లా కలెక్టర్ ఏఎస్.దినేశ్‌కుమార్ ఆకాంక్షించారు. స్థానిక కాఫీ హౌస్‌లో సోమవారం ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహించిన ముందస్తు క్రిస్మస్ వేడుకల్లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. క్రైస్తవులకు సంపూర్ణమైన అండగా ఉండాలనే ఆలోచనతో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ అందరికీ ముందస్తు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. అలాగే పాస్టర్లకు ప్రతి నెలా గౌరవ వేతనం అందిస్తుండడంతో పాటు క్రైస్తవుల పిల్లలకు సైతం విదేశాల్లో విద్యను అందించే ప్రక్రియను ప్రభుత్వం చేపడుతున్నదన్నారు. దానిపై అవగాహన ఏర్పరచుకుని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అంతకుముందు కేకును కట్ చిన్నారులకు తినిపించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ డాక్టర్ ఎంజే. అభిషేక్‌గౌడ, సబ్‌కలెక్టర్ శార్యమన్‌పటేల్, జిల్లా మైక్రో ఇరిగేషన్ ప్రాజెక్టు డైరెక్టర్ రహీమ్, పాస్టర్లు, క్రైస్తవులు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి

» జీసీసీ డైరెక్టర్ బొర్రా నాగరాజు



సలుగు రెవెన్యూ సదస్సులో మాట్లాడుతున్న జీసీసీ డైరెక్టర్ బొర్రా నాగరాజు

పాడేరురూరల్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): భూ సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జీసీసీ డైరెక్టర్ బొర్రా నాగరాజు కోరారు. మండలంలోని సలుగు సచివాలయంలో సోమవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆయన మాట్లాడుతూ ఏళ్ల తరబడి ప్రజలు ఎదుర్కొంటున్న భూ సమస్యలు, భూ సరిహద్దుల సమస్యలు, మ్యూటేషన్‌ల సమస్యలపై ఫిర్యాదులను తహసీల్దార్‌కు అందిస్తే వాటిని ఆన్‌లైన్‌లో నమోదు చేసి సత్వర పరిష్కారానికి చర్యలు చేపడతారన్నారు. అనంతరం తహసీల్దార్ వంజంగి త్రినాథరావు నాయుడు మాట్లాడుతూ వివిధ భూ సమస్యలపై 129 ఫిర్యాదులు అందాయన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ గెమ్మెలి అప్పలకొండ, ఎంపీటీసీ సభ్యురాలు సీహెచ్.మీనా, డీటీ పి.పోలురాజు, ఎలక్షన్ డీటీ కె.లక్ష్మణమూర్తి, సర్వేయర్ వి.భీమయ్య, వీఆర్‌వో పి.ఈశ్వరరావు, టీడీపీ నాయకులు వనుగు సురేంద్ర, వి.దేముడు పాల్గొన్నారు.

కొయ్యూరులో..

గిరిజన రైతులు రెవెన్యూ సదస్సులను సద్వినియోగపరుచుకోవాలని డిప్యూటీ తహసీల్దారు అప్పన్న కోరారు. మంగళవారం ఎం.మాకవరంలో టీడీపీ ఎస్‌టీ సెల్ రాష్ట్ర కార్యదర్శి రామ్మూర్తి అధ్యక్షతన నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆయన 167 వినతులు స్వీకరించారు. కార్యక్రమంలో రీ సర్వే డీటీ అప్పన్న, సర్వేయర్, వీఆర్‌వో పాల్గొన్నారు.

కిశోర బాలికల సంరక్షణపై ప్రత్యేక శ్రద్ధ అవసరం

» జెడ్పీటీసీ సభ్యుడు బాలయ్య



సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీటీసీ సభ్యుడు బాలయ్య

చింతపల్లి, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): కిశోర బాలికల సంరక్షణపై తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని జడ్పీటీసీ సభ్యుడు పోతురాజు బాలయ్య అన్నారు. సోమవారం స్థానిక మండల పరిషత్ సమావేశమందిరంలో ఐసీడీఎస్ అధికారులు కిశోరి వికాసంపై నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. యుక్తవయస్సులో ప్రవేశించిన బాలికల స్వేచ్ఛకు భంగం కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. బాలికలు విద్యలో రాణించేందుకు కృషి చేయాలన్నారు. వివాహ వయస్సు రాకుండా బాల్యవివాహాలు చేయరాదన్నారు. సమాజంలో ఏవిధంగా మెలగాలనే విషయాలను కిశోర బాలికలకు బోధించాలన్నారు. మహిళ హక్కులు, చట్టాలపై అవగాహన కల్పించాలన్నారు. ఎంపీహెచ్‌సీవో స్వామి మాట్లాడుతూ ఆరోగ్య పరంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలను నేర్పించాలన్నారు. సోషల్ మీడియం, అపరిచిత పరిచయాలు, సైబర్ నేరగాళ్లపై అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో సీడీపీవో జీవీ రమణ, ఏసీడీపీవో రామలక్ష్మి, ఎంఈవో పీబీవీవీ ప్రసాద్, సూపర్‌వైజర్లు కె.విజయకుమారి, ఎస్కే. గౌహర్ ఉస్నీష, సీహెచ్.సత్యవతి, ఎస్.గౌరి, పి. అప్పలనర్స పాల్గొన్నారు.





సమావేశంలో మాట్లాడుతున్న విజయనగరం ఆర్టీసీ రీజియన్ చైర్మన్ దొన్నుదొర... పాల్గొన్న విద్యార్థులు, వినియోగదారులు

కొనుగోలు చేసిన ప్రతీ వస్తువుకు బిల్లు తీసుకోండి

విజయనగరం ఆర్టీసీ రీజియన్ చైర్మన్ దొన్నుదొర

అరకులోయ, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): వినియోగదారులు కొనుగోలు చేసిన ప్రతీ వస్తువుకు తప్పనిసరిగా బిల్లు తీసుకోవాలని విజయనగం ఆర్టీసీ రీజియన్ చైర్మన్ సియ్యారి దొన్నుదొర సూచించారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సోమవారం నిర్వహించిన జాతీయ వినియోగదారుల వారోత్సవాల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. వినియోగదారులు వస్తువు నాణ్యతాప్రమాణాలను పరిశీలించుకోవాలన్నారు. వారపు సంతల్లో గిరిజనులు ఆరుగాలం కష్టించి పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు చెల్లించకుండా, తూకాలు సక్రమంగా వేయకుండా వ్యాపారులు మోసగిస్తున్నారని, తీరు మార్చుకోకపోతే చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. అవసరం మేరకే సెల్ వినియోగించుకోవాలన్నారు. డ్రగ్స్ జోలికి విద్యార్థులు వెళ్లకూడదని, అటువంటి అక్రమ వ్యాపారాలకు దూరంగా ఉండాలని సూచించారు. వినియోగదారుల సమాఖ్య జిల్లా అధ్యక్షుడు చిట్టిబాబు, మండల అధ్యక్షుడు ధర్మ, కళాశాల ప్రిన్సిపాల్ పార్వతి తదితరులు వినియోగదారుల చట్టాలు, హక్కులపై మాట్లాడి విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం వారంతా దొన్నుదొరను సత్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మోహన్, వినియోగదారుల సమాఖ్య ప్రతినిధులు, కళాశాల విద్యార్థినులు, సిబ్బంది పాల్గొన్నారు.

బాలకృష్ణ మాస్టారుకు అబ్దుల్ కలాం విజ్ఞాన గురు పురస్కారం



పురస్కారం స్వీకరిస్తున్న బాలకృష్ణ మాస్టారు

పెదబవయలు, డిసెంబర్ 23 (ఆంధ్రజ్యోతి): పెదబయలు ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలుర పాఠశాల-1 జీవ శాస్త్ర ఉపాధ్యాయుడు చెండా బాలకృష్ణ డాక్టర్ అబ్దుల్ కాలం విజ్ఞాన గురు పురస్కారాన్ని అందుకున్నారు. గుంటూరులో నిర్వహించిన రాష్ట్ర స్థాయి వైజ్ఞానిక ఆవిష్కరణలకుగాను ఈ పురస్కారం అందుకున్నారు. ఇస్రో కంప్యూటర్ అండ్ సాఫ్ట్‌వేర్ కమ్యునికేషన్ హెడ్ డాక్టర్ కె.రామ్మోహనరావు ఈ పురస్కారాన్ని అందించారు. ఈ మేరకు మాస్టారును హెచ్ఎం నాగేశ్వరరావు, సహచర ఉపాధ్యాయులు ప్రత్యేకంగా అభినందించి సత్కరించారు.

'మత్స్యకారులకు బోట్లు మంజూరులో అలసత్వం'



నాటుపడవపై చేపల వేటకు వెళ్తున్న మత్స్యకారులు

ముంచంగిపుట్టు, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సుజనకోట, పెదగూడ, దారెల, పనసపుట్టు, బూసిపుట్టు, రంగబయలు, లక్ష్మీపురం, బరడ జోలాపుట్టు తదితర పంచాయతీల్లో మత్స్యగెడ్డ పరివాహన ప్రాంతాల్లో జీవనం సాగిస్తున్న మత్స్యకారులకు వలలు, బోట్లు అందించాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ విషయంలో అధికారులు కాలయాపన చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వలలు, బోట్లను అందించకపోవడంతో ప్రస్తుతం సొంతగా తయారు చేసుకున్న వలలను, నాటుపడలను చేపల వేటకు ఉపయోగిస్తున్నారు. మత్స్యగెడ్డపై చేపల వేటకు నాటుపడవలను ఉపయోగించడం వల్ల తరచూ ప్రమాదాల బారిన పడుతున్నామని మత్స్యకారులు వాపోతున్నారు. చేపల వేటపైనే ఆధారపడి జీవనం సాగిస్తున్నామని, ప్రమాదమని తెలిసినా జీవన పోరాటం కోసం చేపల వేటకు నాటుపడవలను ఉపయోగించడం తప్పడం లేదని దిగాలు చెందుతున్నారు. అధికారులు తమ గ్రామాలను సందర్శించిన సమయంలో వలలు, బోట్లు రాయితీపై అందిస్తామని హామీలు గుప్పిస్తున్నారని, తరువాత ఇటుగా కన్నెత్తి కూడా చూడటం లేదని అసహనం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రాయితీపై వలలు, బోట్లు అందించాలని వారు వేడుకున్నారు.

వీడని విద్యార్థి అదృశ్యం మిస్టరీ

» ఆందోళనలో తల్లిదండ్రులు



మనోజ్ తేజ్(ఫైల్‌ఫొటో)

కొయ్యూరు, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): రెండు వారాల క్రితం అదృశ్యమైన కొయ్యూరు గురుకుల పాఠశాల పదో తరగతి విద్యార్థి వంతన మనోజ్‌తేజ్ ఆచూకీ ఇంకా దొరకలేదు. దీంతో తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. విద్యార్థి కోసం అటు తల్లిదండ్రులు, ఇటు పాఠశాల సిబ్బంది ముమ్మరంగా గాలిస్తున్నారు. అయినప్పటికీ ఫలితం లేకుండా పోతోంది. అసలు మనోజ్ తేజ్ ఏమై ఉంటాడనేది మిస్టరీగా మారింది. ఇదిలావుండగా మనోజ్ తేజ్ లంబసింగి పరిసరాలలో తిరుగుతున్నాడనే వాదన వినిపిస్తోంది. అతని ఆచూకీని ఎవరైనా గుర్తిస్తే 7981391699కు సమాచారమివ్వాలని బంధువులు కోరుతున్నారు.

27వ తేదీలోగా బూత్ కమిటీలు ఏర్పాటు చేయాలి

» బీజేపీ ఎన్నికల రిటర్నింగ్ అధికారి పుట్టా గంగయ్య



సమావేశంలో మాట్లాడుతున్న పుట్టా గంగయ్య

కొయ్యూరు, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండల పార్టీ అధ్యక్ష స్థానంతోపాటు గ్రామ స్థాయి నుంచి బలోపేతం చేసేలా బూత్ కమిటీలు ఈనెల 26, 27 తేదీలలో పూర్తి చేయాలని బీజేపీ ఎన్నికల రిటర్నింగ్ అధికారి పుట్టా గంగయ్య సూచించారు. మంగళవారం స్థానిక గిరిజన భవన్‌లో బీజేపీ జిల్లా అధక్షుడు పాంగి రాజారావు అధ్యక్షతన జరిగిన పార్టీ కోర్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్టీ మండల, జిల్లా స్థాయి అధ్యక్షులు, కార్యవర్గాలకు ఎన్నికలు నిర్వహిస్తామన్నారు. మండల స్థాయిలో నిర్వహించే ఎన్నికలకు జిల్లా స్థాయి నాయకులు పరిశీలకులుగా ఉండాలన్నారు. ముఖ్యంగా ఈ ప్రక్రియ ఈనెల 26, 27 తేదీలతో ముగియాలన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యదర్శి రామకృష్ణ, పాడేరు, రంపచోడవరం నియోజకవర్గాల కన్వీనర్ పాంగి కృష్ణారావు, బీజేపీ మైనార్టీ మోర్చా రాష్ట్ర కార్యదర్శి రీముల చంద్రరావు, నేతలు అప్పలరాజు, ఇరుబుల్లి, శెట్టి రాజు, గాలి దేముడు, నెల్లి సత్తిబాబు, మంగ, అరిమెల రాజు, కొర్రా త్రినాథ్ పాల్గొన్నారు.

పేదలకు క్రైస్తవులు క్రీస్తు ప్రేమను పంచాలి

» పాస్టర్ జేమ్స్ క్రిష్టోఫర్



వాక్యోపదేశం చేస్తున్న పాస్టర్ జేమ్స్ క్రిష్టోఫర్

చింతపల్లి, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): క్రైస్తవులు పేదలకు క్రీస్తు ప్రేమను పంచాలని తమిళనాడుకు చెందిన వరల్డ్ గాస్పల్ మిషన్ సొసైటీ పాస్టర్ జేమ్స్ క్రిష్టోఫర్ అన్నారు. సోమవారం స్థానిక ఆదివాసీ ప్రభావిత పథం చర్చిలో పాస్టర్ డి. ఈనక్ ఆధ్వర్యంలో సెమీ క్రిస్మస్ వేడుకలు జరిగాయి. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మానవులు ప్రేమ, కరుణతో సన్మార్గంలో జీవించే విధానాన్ని యేసు నేర్పించారన్నారు. కార్యక్రమంలో బైబిల్ కళాశాలి ప్రిన్సిపాల్ ఎం. నిర్మల్ కుమార్, ఆదివాసీ ప్రభావిత పథకం సీనియర్ పాస్టర్ వి. సోమరాజు, బోధకులు ఎల్. యేసురత్నం, ముర్ల రమణ, బాలరాజు, సంఘ పెద్దలు బుజ్జిబాబు, అశోక్, కూటమి నాయకుడు రీమల ఆనందరావు పాల్గొన్నారు.

హైవే పనుల్లో నాణ్యతా లోపం

మూడు నెలలకే కూలిన డ్రైన్‌పై వేసిన కాంక్రీట్



అప్రోచ్ డ్రైన్‌పై నిర్మించిన సీసీ పలకలు ధ్వంసమైన దృశ్యం

కొయ్యూరు, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారి నిర్మాణ పనులపై తగిన పర్యవేక్షణ కొరవడిందనడానికి నిదర్శనం అప్రోచ్ రోడ్డు నిర్మాణాలకు డ్రైన్లపై వేసిన సీసీ రోడ్డు శిథిలమైంది. మండలంలో ఎం. మాకవరం పంచాయతీ పనసలపాడు గ్రామానికి వెళ్లేందుకు వీలుగా పిట్టచలం వద్ద జాతీయ రహదారి నుంచి అప్రోచ్ రోడ్డు కలిపారు. అయితే డ్రైన్ పై సీసీ కాంక్రీట్ వేశారు. ఇది వేసిన మూడు నెలలు తిరగక ముందే డ్రైన్‌పై వేసిన సీసీ కాంక్రీట్ విరిగిపోయింది. దీంతో పిట్టచలం గ్రామం నుంచి పనసలపాడు వాహనాలు తిరిగేందుకు ఇబ్బందిగా మారింది. కాంక్రీట్ కూలిన రెండు వారాలు గడుస్తున్నా మరమ్మతులు చేపట్టలేదు. ఇప్పటికైనా హైవే సిబ్బంది స్పందించి సమస్య పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని పనసలపాడు వాసులు కోరుతున్నారు.

నలుగురు పేకాటరాయళ్ల అరెస్టు

సబ్బవరం, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ పరిధి గంగవరం గ్రామంలో పేకాట ఆడుతున్న నలుగురిని ఇక్కడి పోలీసులు అరెస్టు చేశారు. ఇందుకు సంబంధించి సీఐ పిన్నింటి రమణ తెలిపిన వివరాలి. గంగవరం సమీపంలో ఆదివారం రాత్రి పేకాట ఆడుతున్నట్టు అందిన ముందస్తు సమాచారం మేరకు ఏఎస్ఐ గణేష్ పడాల్ సిబ్బందితో వెళ్లి దాడి చేశారన్నారు. అదే గ్రామానికి చెందిన ఎం.వేణుగోపాల్, శ్రీను, నూకరాజు, శ్రీనులను అరెస్టు చేసి, రూ.6,100 నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు. అనంతరం నిందితులను సోమవారం కోర్టులో ప్రవేశపెట్టినట్టు చెప్పారు.

సాంకేతికతతో సమస్యల పరిష్కారం

అనకాపల్లి టౌన్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : సాంకేతికత సహాయంతో వినియోగదారుల సమస్యలను సత్వరం పరిష్కరించవచ్చునని జిల్లా పౌర సరఫరాల అధికారి (డీసీఎస్‌వో) కేవీఎల్ నరసింహమూర్తి అన్నారు. జాతీయ వినియోగదారుల వారోత్సవాల్లో భాగంగా సోమవారం ఇక్కడి గౌరీ గ్రంథాలయంలో 'వినియోగదారుల న్యాయపాలనకు వర్చువల్ విచారణలు, డిజిటల్ సౌలభ్యం' అంశం పై జరిగిన సదస్సులో మాట్లాడారు. వినియోగదారుల చట్టం-2019 పరిధిలోకి ఆన్ లైన్ వినియోగదారులు కూడా వస్తారని స్పష్టం చేశారు. వినియోగదారుల రక్షణ చట్టం ప్రకారం మధ్యవర్తిత్వం ద్వారా సమస్యలను పరిష్కరించుకోవచ్చన్నారు వస్తు సేవల్లో మోసపోయిన వినియోగదారులు నేషనల్ కన్స్యూమర్ హెల్ప్‌లైన్ నంబరు 1915, ఏపీ ఇంటిగ్రేటెడ్ కాల్ సెంటర్ నం బరు 1967లను సంప్రదించాలని సూచించారు.

సాంకేతికతతో వినియోగదారుల సమస్యలు పరిష్కారం

» జిల్లా పౌర సరఫరాల అధికారి నరసింహమూర్తి



సదసులో మాట్లాడుతున్న డీసీఎస్‌వో నరసింహమూర్తి

అనకాపల్లి టౌన్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : సాంకేతికత సహాయంతో వినియోగదారుల సమస్యలను సత్వరం పరిష్కరించవచ్చునని జిల్లా పౌర సరఫరాల అధికారి (డీసీఎస్‌వో) కేవీఎల్ నరసింహమూర్తి అన్నారు. జాతీయ వినియోగదారుల వారోత్సవాల్లో భాగంగా సోమవారం ఇక్కడి గౌరీ గ్రంథాలయంలో 'వినియోగదారుల న్యాయపాలనకు వర్చువల్ విచారణలు, డిజిటల్ సౌలభ్యం' అంశం పై జరిగిన సదస్సులో మాట్లాడారు. వినియోగదారుల చట్టం-2019 పరిధిలోకి ఆన్‌లైన్ వినియోగదారులు కూడా వస్తారని స్పష్టం చేశారు. వినియోగదారుల రక్షణ చట్టం ప్రకారం మధ్యవర్తిత్వం ద్వారా వినియోగదారుల సమస్యలను పరిష్కరించుకోవచ్చునని వివరించారు. వస్తు సేవల్లో మోసపోయిన వినియోగదారులు నేషనల్ కన్స్యూమర్ హెల్ప్‌లైన్ నంబరు 1915, ఏపీ ఇంటిగ్రేటెడ్ కాల్ సెంటర్ నంబరు 1967లను సంప్రదించాలని ఆయన సూచించారు. కన్స్యూమర్ ఆర్గనైజేషన్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కాండ్రేగుల వెంకటరమణ మాట్లాడుతూ బీఐఎస్ కేర్ యాప్ ద్వారా బంగారు ఆభరణాల స్వచ్ఛతను తెలుసుకోవచ్చునన్నారు. డిజిటల్ లావాదేవీల్లో కొత్త సాంకేతిక పద్ధతులపై అవగాహన కల్పించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అధ్యక్షుడు దొడ్డి నూకఅప్పారావు, వెనుకబడిన తరగతుల సంక్షేమశాఖ జిల్లా సహాయ అధికారులు కె.కృష్ణారావు, ఎం.నర్సింహులు, హాస్టల్ వార్డెన్ ఎస్.సత్యనారాయణ, గ్రంథాలయ ప్రతినిధులు పాల్గొన్నారు.

'కిశోర వికాసంపై అవగాహన కలిగి ఉండాలి'



శిక్షణ శిబిరంలో మాట్లాడుతున్న ఐసీడీఎస్ సీడీపీవో ప్రభావతి

కశింకోట, డిసెంబర్ 23 (ఆంధ్రజ్యోతి) : కిశోర వికాసంపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఐసీడీఎస్ సీడీపీవో ప్రభావతి అన్నారు. సోమవారం ఇక్కడి మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటైన శిక్షణ శిబిరంలో మాట్లాడారు. కిశోర వికాసం ఆవశ్యకతను వివరించారు. కౌమారదశ, పోషణ, రక్షణ, విద్యా సాధికారత, ఆరోగ్యం, లింగవివక్ష తదితర అంశాలపై మహిళా పోలీసులకు, విద్యా, సంక్షేమ అధికారులు, టీచర్లు, లెక్చరర్లకు శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ తిరుపతిరావు, సంరక్షణ అధికారి కుసుమ, న్యాయవాది వెంకటలక్ష్మి, పంచాయతీ ఈవో రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

నలుగురు పేకాటరాయళ్ల అరెస్టు

సబ్బవరం, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ పరిధి గంగవరం గ్రామంలో పేకాట ఆడుతున్న నలుగురిని ఇక్కడి పోలీసులు అరెస్టు చేశారు. ఇందుకు సంబంధించి సీఐ పిన్నింటి రమణ తెలిపిన వివరాలి. గంగవరం సమీపంలో ఆదివారం రాత్రి పేకాట ఆడుతున్నట్టు అందిన ముందస్తు సమాచారం మేరకు ఏఎస్ఐ గణేష్ పడాల్ సిబ్బందితో వెళ్లి దాడి చేశారన్నారు. అదే గ్రామానికి చెందిన మాటూరి వేణుగోపాల్, శ్రీను, నూకరాజు, శ్రీనులను అరెస్టు చేసి, వారి వద్ద నుంచి రూ.6,100 నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు. అనంతరం నిందితులను సోమవారం కోర్టులో ప్రవేశపెట్టినట్టు చెప్పారు.

'27న విద్యుత్ చార్జీల పెంపుపై పోరుబాట'



పోస్టర్ ఆవిష్కరణలో ముత్యాలనాయుడు తదితరులు

అనకాపల్లి టౌన్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ చార్జీల బాదుడుపై ఈ నెల 27న చేపట్టనున్న పోరుబాటను అంతా విజయవంతం చేయాలని మాజీ డిప్యూటీ సీఎం, వైసీపీ జిల్లా అధ్యక్షుడు బూడి ముత్యాలనాయుడు పిలుపునిచ్చారు. ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను సోమవారం ఇక్కడి రింగురోడ్డులోని పార్టీ కార్యాలయంలో ఆవిష్కరించి మాట్లాడారు. విద్యుత్ చార్జీలు పెంచబోమని ఎన్నికల ముందు హామీ ఇచ్చిన చంద్రబాబు, అధికారంలోకి వచ్చిన తరువాత ప్రజలపై భారాలను మోపుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు కంబాల జోగులు, అదీప్‌రాజ్, వైసీపీ నాయకులు దంతులూరి దిలీప్‌కుమార్, మందపాటి జానకిరామరాజు, మలసాల కిశోర్, కేఎం నాయుడు, కోరుకొండ రాఘవతో పాటు పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

తాళ్లపాలెం 'గురుకులం'లో సొసైటీ కార్యదర్శి తనిఖీ



గురుకుల పాఠశాలలో స్టోర్‌రూమ్‌ను పరిశీలిస్తున్న ప్రసన్న వెంకటేశ్

కశింకోట, డిసెంబర్ 23 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని తాళ్లపాలెంలో ఉన్న డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ గురుకుల పాఠశాలను ఏపీ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇనిస్టిట్యూషనల్ సొసైటీ కార్యదర్శి వి.ప్రసన్న వెంకటేశ్ సోమవారం తనిఖీ చేశారు. విశాఖపట్నం నుంచి విజయవాడ వెళుతూ.. మార్గ మధ్యలో ఉన్న తాళ్లపాలెం గురుకుల పాఠశాలను సందర్శించారు. విద్యార్థుల వసతి సదుపాయం, మెనూ అమలు తీరు గురించి ఆరా తీశారు. స్టోర్ రూమ్‌లో సరకులు, రికార్డులను తనిఖీ చేశారు. ఏటీఎల్ ల్యాబ్, మరుగుదొడ్లను పరిశీలించారు. టీచర్స్ లెర్నింగ్ మెటీరియల్ గురించి ప్రిన్సిపాల్ గ్రేస్‌ను అడిగి తెలుసుకున్నారు. విద్యా ప్రమాణాల పెంపు, విద్యార్థుల సంక్షేమానికి సంబంధించి ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. ఆయన వెంట ఉమ్మడి జిల్లాల కో-ఆర్డినేటర్ ఎస్.రూపవతి ఉన్నారు.

గ్రామ స్థాయిలోనే భూ సమస్యలు పరిష్కారం

పరవాడ, డిసెంబరు 23 : జీవీఎంసీ 79వ వార్డు లంకెలపాలెంలో సోమవారం అధికారులు రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా రీసర్వే డిప్యూటీ తహసీల్దార్ సురేశ్ మాట్లాడుతూ రెవెన్యూ సదస్సుల ద్వారా భూ సమస్యలు పరిష్కరించుకో వచ్చునన్నారు. అనంతరం వివిధ సమస్యలపై 43 మంది అర్జీలను అందజేశారు. ఈ కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్, సర్వేయర్ శ్రీనివాస్, వీఆర్వో సాయికుమార్, కూటమి నాయకులు పాల్గొన్నారు.

సబ్బవరం : రెవెన్యూ సదస్సుల ద్వారా భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని తహసీల్దార్ బి.చిన్నికృష్ణ తెలిపారు. బాటజంగాలపాలెంలో సోమవారం నిర్వహించిన సదస్సులో మాట్లాడారు. గ్రామ స్థాయిలోనే భూ వివాదాల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం ఈ సదస్సులను నిర్వహిస్తున్నట్టు చెప్పారు. డిప్యూటీ తహసీల్దార్ గణపతిరావు, సర్పంచ్ పడాల వెంకటరమణ, మండల సర్వేయర్ ఎల్.అప్పారావు, సచివాలయ సర్వేయర్లు లోకేశ్, ఆశిఫ్, వెలుగు సర్వేయర్ రాంబాబు, గ్రామ పెద్దలు బలిరెడ్డి రామచంద్రరావు, కాపుశెట్టి వెంకట్, గూడపాటి రామారావు తదితరులు పాల్గొన్నారు.

చెరువు కాదు.. రోడ్డే

» అనకాపల్లిలో అధ్వానంగా మారిన స్టేషన్ మార్గం
» ఏడాదిగా ముందుకు సాగని విస్తరణ పనులు
» పలువురికి టీడీఆర్‌లు ఇవ్వడంలో జాప్యం
» వర్షపు నీరు చేరడంతో తీవ్ర అవస్థలు



చిన్నవీధికి వెళ్లే మార్గంలో నిలిచిన వర్షపు నీరు



జైన్ స్టోర్ సమీపంలో రోడ్డుపై ఉన్న గుంతలో...

అనకాపల్లి టౌన్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : పట్టణం నడిబొడ్డున ఉన్న స్టేషన్‌రోడ్డు చెరువును తలపిస్తోంది. పెరుగుబజార్ జంక్షన్ నుంచి రైల్వేస్టేషన్‌కు వెళ్లే రోడ్డులోని గాంధీబొమ్మ జంక్షన్ వరకు రహదారి అధ్వానంగా మారింది. ఈ రోడ్డు విస్తరణ పనులను గత ఏడాది జీవీఎంసీ అధికారులు ప్రారంభించినా నేటి వరకు పూర్తిస్థాయిలో జరగలేదు. విస్తరణలో భాగంగా ఈ మార్గంలో ఆస్తులు కోల్పోయిన వారికి ట్రాన్స్‌ఫర్ డెవలప్‌మెంట్ రైట్స్ (టీడీఆర్)లు ఇవ్వడంలో తీవ్ర జాప్యం జరుగుతోంది. దీంతో పనులు ముందుకు సాగలేదు. అధికారులు కూడా నిర్మాణ పనులకు చర్యలు చేపట్టలేదు.

గతంలో భవనాలు తొలగించినప్పుడు భవనాల మట్టి రోడ్లపైనే పడి ఉండడంతో వర్షాలు కురిసే సమయంలో ఆయా ప్రాంతాలు చెరువును తలపించేలా తయారవుతున్నాయి. దీంతో ఈ మార్గంలో రాకపోకలు సాగించేవా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

ప్రధాన మార్గమైనా.. పట్టని అధికారులు

పెరుగుబజార్ జంక్షన్‌లో పలు కిరాణా దుకాణాలు, మెడికల్ షాపులు, ఇతర వాణిజ్య దుకాణాలు ఉన్నాయి. సినిమా థియేటర్ కూడా ఉంది. రైల్వేస్టేషన్, మళ్లవీధి, కోట్నీవీధి, నాయుళ్లవీధి తదితర ప్రాంతాలకు వెళ్లాలంటే ఇదే ప్రధాన మార్గం.

ఏడాదికి పైగా ఇదే దుస్థితి

ఏడాదికి పైగా రహదారి పరిస్థితి ఇదే మాదిరిగా ఉంది. ఫలితంగా పాదచారులకు, వాహనచోదకులకు ఇక్కట్లు తప్పడం లేదు. రోడ్డుపై ఎనభై శాతం వరకు గోతుల్లో వర్షపునీరు నిలిచిపోవడం వల్ల వాహనచోదకులు గట్టు వెంబడి రాకపోకలు సాగిస్తున్నారు. పలు సందర్భాల్లో వాహనాలు అదుపుతప్పి ప్రమాదాలకు గురవుతున్న సంఘటనలు కూడా లేకపోలేదు.

గోతుల్లో చేరిన వర్షపు నీరు

ఇదిలావుంటే, రహదారిపై పడిన గోతుల్లో అల్పపీడనం కారణంగా గత మూడు నాలుగు రోజులపాటు కురిసిన మోస్తరు వర్షపు నీరు వాటిలో చేరి నిలిచిపోయింది. దీంతో రోడ్డు ఎక్కడో, గుంత ఎక్కడో తెలుసుకోలేని వాహనచోదకులు పలువురు ప్రమాదాలకు గురవుతున్నారు. చీకటిపడితే ఈ మార్గంలో నడవాలన్నా కష్టంగా ఉందని పాదచారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు ఇప్పటికైనా వెంటనే స్పందించి విస్తరణ పనులతో పాటు రహదారి నిర్మాణాన్ని చేపట్టాలని ఆ ప్రాంత ప్రజలంతా కోరుతున్నారు.

త్వరలో పనులు చేపడతాం



స్టేషన్ రోడ్డులో పనులను త్వరలో చేపడతాం. ఈ మార్గంలో ఆస్తులు కోల్పోయిన వారికి టీడీఆర్‌లు ఇవ్వాల్సి ఉంది. 28 మందికి టీడీఆర్‌లు సిద్ధమవుతున్నాయి. రెండు రోజుల్లో వారికి వాటిని అప్పగిస్తాం. మిగిలిన కొంతమందికి కూడా జనవరి పదో తేదీలోపు ఇస్తాం. రహదారి నిర్మాణ పనులు కూడా త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటాం.

- ఎస్.శేఖర్, ఈఈ జీవీఎంసీ

అర్జీలకు సత్వర పరిష్కారం

» 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక'లో అధికారులను ఆదేశించిన కలెక్టర్ విజయకృష్ణన్
» కార్యక్రమం ముగిసే సమయానికి 246 మంది విజ్ఞాపనలు



అర్జీదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ విజయకృష్ణన్, చిత్రంలో జేసీ జాహ్నవి



పోలీస్ కార్యాలయంలో అర్జీదారు సమస్య వింటున్న ఏఎస్పీ దేవప్రసాద్

అనకాపల్లి కలెక్టరేట్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వచ్చే ప్రతి అర్జీపై ప్రత్యేక దృష్టి సారించడంతో పాటు వెంటనే చర్యలు చేపట్టాలని కలెక్టర్ విజయకృష్ణన్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో సోమవారం ఆమె జాయింట్ కలెక్టర్ జాహ్నవితో కలిసి ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ప్రతి ఒక్కరి సమస్యను తెలుసుకున్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ అర్జీ అందిన వెంటనే క్షుణ్ణంగా పరిశీలించి, సంబంధిత అధికారులు సిబ్బందితో సమన్వయం చేసుకుంటూ పరిష్కరించాలన్నారు. వీటిపై మూడు రోజుల్లో చర్యలు తీసుకోవాలన్నారు. ఇందుకు సంబంధించి సిబ్బందితో రోజు వారీ సమీక్ష నిర్వహించుకోవాలన్నారు. ప్రధానంగా అర్జీలు రీ ఓపెన్ కాకుండా చూడాల్సిన బాధ్యత ఆయా శాఖలపై ఉందని స్పష్టం చేశారు. ఇదిలావుంటే, ఈ కార్యక్రమం ముగిసే సరికి 246 అర్జీలు అందాయని కలెక్టరేట్ విభాగం అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లాస్థాయి అధికారులు పాల్గొన్నారు.

జిల్లా పోలీస్ కార్యాలయంలో...

జిల్లా పోలీస్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదికను నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి ఏఎస్పీ దేవప్రసాద్ అర్జీలను స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజలు విన్నవించిన సమస్యలను పూర్తిస్థాయిలో పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమం ముగిసే సరికి 22 అర్జీలు అందాయి. వాటిలో భూ తగాదాలు, కుటుంబ కలహాలు, మోసాలు తదితరాలకు సంబంధించి ఎక్కువగా ఉన్నాయని పోలీస్ విభాగాధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

27న రాష్ట్ర వాలీబాల్ జట్ల ఎంపిక

అనకాపల్లి టౌన్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : విజయవాడలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో ఈ నెల 27న జరిగే రాష్ట్ర స్త్రీ పురుషుల వాలీబాల్ జట్ల ఎంపికకు ఆసక్తి గల క్రీడాకారులు హాజరు కావాలని జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ అధికారి రమణ సోమవారం ఒక ప్రకటనలో కోరారు. ఇక్కడ ఎంపికైన జట్లు రాజస్థాన్ రాష్ట్రం జైపూర్‌లో జనవరి ఏడు నుంచి 13వ తేదీ వరకు జరగనున్న సీనియర్ జాతీయ వాలీబాల్ పోటీలకు హాజరవుతారని వివరించారు. రాష్ట్ర జట్టు ఎంపికకు సంబంధించి క్రీడాకారులు ఈ నెల 27వ తేదీ ఉదయం ఏడు గంటలకు ఆధార్‌కార్డు, నేటివిటీ సర్టిఫికెట్, పది పాస్‌పోర్టు సైజు ఫొటోలతో విజయవాడలోని వాలీబాల్ కోర్టుకు హాజరు కావాలని ఆయన పేర్కొన్నారు.

అంబేడ్కర్ భవనం ఏర్పాటుకు వినతి



రత్నాకర్‌కు వినతిపత్రం అందిస్తున్న రామారావు

అనకాపల్లి టౌన్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రమైన అనకాపల్లిలో అంబేడ్కర్ భవనం ఏర్పాటుకు చొరవ చూపాలని అంబేడ్కర్ యువజన సేవా సంఘం గౌరవాధ్యక్షుడు రేబాక రామారావు టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దాడి రత్నాకర్‌ను కోరారు. సోమవారం ఇక్కడ ఆయనను కలిసి వినతి పత్రం అందజేశారు. దళితులకు కమ్యూనిటీ హాల్ లేకపోవడం చాలా బాధాకరమని పేర్కొన్నారు. కమ్యూనిటీ హాల్, లైబ్రరీ ఏర్పాటు చేసేందుకు కృషిచేయాలన్నారు. ఆయన వెంట జిల్లా విజిలెన్స్ అండ్ మోనటరింగ్ కమిటీ సభ్యుడు రేబాక మధుబాబు, ఎస్సీ, ఎస్టీ టీచర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు పల్లా బాబ్జి, టీడీపీ ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు మైలపల్లి పోతురాజు, జైభీమ్ సేన జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లవరపు లోవచందు ఉన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ

సబ్బవరం, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రం సబ్బవరం శివారు చిన గొల్లలపాలెంలో ఎమ్మెల్యే నిధులు రూ. 14 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణానికి సర్పంచ్ దెడ్డం ప్రసాదరావు సోమవారం భూమి పూజ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ గొర్లి చైతన్య, వార్డు మెంబర్లు పల్ల తాతారావు, పోతల కనకరాజు, కోరాడ శ్రీను, శేఖర్, జెట్టి ప్రసాద్, కోన సోమేశ్వరరావు, పల్ల సన్యాసి రావు తదితరులు పాల్గొన్నారు.

'రక్షిత్ డ్రగ్స్‌లో ఘటనపై విచారణ చేపట్టాలి'

పరవాడ, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి ఫార్మాసిటీలోని రక్షిత్ డ్రగ్స్ పరిశ్రమలో విషవాయువులు లీకైన ఘటనపై సమగ్ర విచారణ జరిపించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ విషవాయువులు లీకై ఇద్దరు కార్మికులు తీవ్ర అస్వస్థతకు గురై ఆస్పత్రిలో చావుబతుకుల మధ్య కొట్టుమిట్టాడుతున్నారన్నారు. కార్మికుల ప్రాణాలంటే యాజమాన్యానికి పట్టింపు లేకుండా పోయిందని మండిపడ్డారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కార్మికులిద్దరికీ మెరుగైన వైద్యం అందించాలని కోరారు.

ఆంగ్ల భాషలో శిక్షణ పొందిన టీచర్‌కు సత్కారం



ఉమామహేశ్వరిని సత్కరిస్తున్న డీఈవో

కొత్తూరు, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : ఆంగ్ల భాషలో ప్రత్యేక శిక్షణ పొందిన అనకాపల్లి మండలంలోని తగరంపూడి ఎంపీపీ స్కూల్ ఉపాధ్యాయిని మళ్ల ఉమా మహేశ్వరిని డీఈవో కార్యాలయంలో సోమవారం సత్కరించారు. ఈ సందర్భంగా డీఈవో గిడ్డి అప్పారావునాయుడు ఆమెకు పూలమాల వేసి, శాలువ కప్పి అభినందించారు. బెంగళూరులో ఉన్న దక్షిణ భారత రీజనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంగ్లీష శిక్షణ కేంద్రంలో అనకాపల్లి జిల్లా నుంచి ఆమె హాజరై నెల రోజుల పాటు ప్రత్యేక శిక్షణ పొందారని ఆయన వివరించారు. డీఈవో కార్యాలయ అధికారులు వెంకటేశ్వరరావు, సత్యప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

5న ఎంజీహెచ్ స్కూల్ పూర్వ విద్యార్థుల సమ్మేళనం



అనకాపల్లిలో సమావేశమైన సంఘం ప్రతినిధులు

అనకాపల్లి టౌన్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని మున్సిపల్ గవరపాలెం హైస్కూల్ పూర్వ విద్యార్థుల సంక్షేమ సంఘం ఆత్మీయ వన సమారాధన జనవరి ఐదో తేదీన జరగనుందని కమిటీ అధ్యక్షుడు బల్లా నాగభూషణం తెలిపారు. స్థానిక రైతు భారతి కల్యాణ మండపంలో సోమవారం జరిగిన సంఘం సమావేశంలో మాట్లాడారు. ఈ కార్యక్రమం ఈ నెల 29న జరగాల్సి ఉండగా అనివార్య కారణాల వల్ల వాయిదా పడినట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు దాడి శివరామకృష్ణ, బొడ్డేడ అప్పారావు, పిళ్లా శివఅప్పారావు, పట్నాల కృష్ణమోహన్, కె.రామారావు, కెఎస్‌వీ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

క్రిస్మస్ వేడుకలకు చర్చిలు ముస్తాబు



విద్యుద్దీపాలంకరణలో సెంటినరీ బాప్టిస్టు చర్చి

అనకాపల్లి టౌన్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : క్రిస్మస్ వేడుకలు మరో 24 గంటల్లో ప్రారంభం కానున్న నేపథ్యంలో పట్టణంలోని చర్చిల వద్ద సోమవారం సందడి వాతావరణం నెలకొంది. విద్యుద్దీపాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. ఇక్కడ ప్రధానమైన ఆర్‌సీఎం చర్చి, సెంటినరీ బాప్టిస్టు చర్చిలు వేడుకలకు ముస్తాబయ్యాయి. బాప్టిస్టు చర్చిని తీర్చిదిద్దారు. శారదానది మార్గం వైపు వెళ్లే వారికి ఈ చర్చికి అలంకరించిన విద్యుద్దీపాలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి.

మినీ వాటర్ ట్యాంక్‌కు మరమ్మతులు చేయించండి



జీవీఎంసీ అధికారికి వినతి పత్రం అందిస్తున్న జోగినాయుడు

అనకాపల్లి టౌన్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : జీవీ ఎంసీ 80వ వార్డు కర్రివారి వీధిలో నిరుపయోగంగా ఉన్న మినీ వాటర్ ట్యాంక్‌ను మెరుగుపరిచి, ఆ ప్రాంత ప్రజలకు తాగునీటి సౌకర్యం కల్పించాలని వార్డు టీడీపీ ఇన్‌చార్జి బీఎస్ఎంకే జోగినాయుడు కోరారు. ఈ మేరకు జీవీఎంసీ అధికారికి సోమవారం వినతి పత్రం అందజేశారు. మినీ ట్యాంక్ ద్వారా మంచినీరు సరఫరా అయ్యే పైపులైన్ పూర్తిగా పాడైందన్నారు. చినరామస్వామి కోవెల వద్ద మినీ వాటర్ ట్యాంక్ ద్వారా వచ్చే పైపులైన్లు కూడా పాడయ్యాయని వివరించారు. ఈ సమస్యలపై స్పందించాల్సిందిగా విజ్ఞప్తి చేశారు.

దొంగ గెడ్డ స్థలం కబ్జా

» అధికారులు పట్టించుకోక పోవడంతో రెచ్చిపోతున్న ఆక్రమణదారులు
» మొక్కలు, చెట్లు తొలగించి కంచె » కార్యదర్శికి ఫిర్యాదు



ఆక్రమించిన దొంగ గెడ్డ స్థలాన్ని పరిశీలిస్తున్న కార్యదర్శి, నాయకులు

కొత్తూరు, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : అనకాపల్లి మండలంలోని మేజర్ పంచాయతీ కొత్తూరులో ఆక్రమణలు జోరుగా సాగుతున్నాయి. కొందరు అధికారులు తమకు పట్టనట్టు వ్యవహరిస్తుండడంతో అక్రమార్కులు రెచ్చిపోతున్నారు. ఇందులో భాగంగా మేజర్ పంచాయతీ కొత్తూరు పరిధి సత్యనారాయణపురం గ్రామానికి వెళ్లే రహదారిని ఆనుకొని ఉన్న దొంగగెడ్డను కొంత మంది ఆక్రమణదారులు ఆక్రమించారు. చెట్లను నరికి ఆ స్థలంలో కంచె వేశారు. దీనిపై స్థానికులు సదరు పంచాయతీ కార్యదర్శి సుభాష్‌కు సమాచారం అందించారు. అయితే వేసిన కంచెను తొలగిస్తారా.. లేక చర్యలు తీసుకోమంటారా అనేది తేలాల్సి ఉంది. దీనిపై స్థానికులు ఆక్రమణలన్నీ తొలగిస్తే వీటిని కూడా తొలగిస్తామని చెప్పడంతో రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసి, తొలగించే చర్యలు చేపడతామని ఆయన బదులిచ్చారు. అదే విధంగా దొంగగెడ్డను ఆనుకొని అవతలవైపు నిర్మాణాలను పరిశీలించారు. తక్షణమే అక్రమ నిర్మాణాలను నిలిపివేయాలని సూచించారు. ఆయన వెంట గ్రామ నాయకులు వరహాలబాబు, తాడి చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

వెదురుపర్తిలో ముగిసిన జాతీయ గణిత మాసోత్సవాలు



గ్రామంలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

కశింకోట, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వెదురుపర్తి ఉన్నత పాఠశాలలో జాతీయ గణిత మాసోత్సవాలు ఘనంగా ముగిశాయి. నెల రోజుల పాటు విద్యార్థులకు వివిధ ఆటలు, పాటలు, కథలు, లఘు నాటికల ద్వారా గణితాన్ని బోధించారు. అంతేకాకుండా క్విజ్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కాగా విద్యార్థులు గ్రామంలో ర్యాలీ నిర్వహించి అందరికీ గణిత శాస్త్రవేత్త శ్రీనివాస రామానుజన్ జీవిత చరిత్రను వివరించారు. గణిత ఉపాధ్యాయుడు ఏవీఎస్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

మొక్కల ప్రేమికుడు!

అతడో సాధారణ కారు డ్రైవర్. చాలీచాలని సంపాదనతో కుటుంబాన్ని పోషించుకుంటాడు. కానీ మొక్కలంటే అమిత ప్రేమ. పర్యావరణ పరిరక్షణకు తన వంతు ఏదైనా చేయాలనే అభిలాష. దీంతో మొక్కల పెంపకానికి శ్రీకారం చుట్టాడు. తన సంపాదనలో కొంత మొత్తాన్ని మొక్కల కొనుగోలుకు వినియోగించి, ఇప్పటివరకు సుమారు 400 మొక్కలు నాటాడు. వృక్ష ప్రేమికులకు ఉచితంగా మరిన్ని మొక్కలు అందించాడు. ప్రకృతిని కాపాడేందుకు అందరూ తమ వంతు బాధ్యత నిర్వర్తించాలని పిలుపునిస్తున్న పెందుర్తికి చెందిన ఆళ్ల శ్రీను జీవీఎంసీ సహకరిస్తే వేలాది మొక్కలను నాటి, సంరక్షించాలనే ధ్యేయంలో ఉన్నాడు.

- పెందుర్తి, ఆంధ్రజ్యోతి

పర్యావరణ పరిరక్షణకు దీక్ష

- సొంత డబ్బుతో కార్యాచరణ
- ఇప్పటికే 400 మొక్కలు నాటిన వైనం
- పదివేలు నాటాలన్నదే లక్ష్యం
- జీవీఎంసీ సహకారానికి ఎదురుచూపులు
- పచ్చదనం పెంపునకు అవిరళ కృషి
- **ఆదర్శంగా నిలుస్తున్న కారు డ్రైవర్ ఆళ్ల శ్రీను**

పెందుర్తి బీసీ కాలనీకి చెందిన ఆళ్ల శ్రీను కారు డ్రైవర్. నెలకు రూ.10 వేల లోపే సంపాదన. చిన్నతనంలో తన తాతగారికి కొబ్బరి తోట ఉండేది. ఆ చెట్ల పచ్చదనం మధ్య బాల్యం నడిచింది. ఆర్థిక పరిస్థితులు అనుకూలించక తోట విక్రయించేశారు. కానీ ఆ తోటలో గడిపిన అనుభవాలు శ్రీను మనుసులో పదిలంగా నాటుకున్నాయి. తనతో పాటే ఆశయం పెరిగింది.

ఇంటి నుంచే తొలి అడుగు...

ఆశయ సాధనకు తన ఇంటి నుంచే తొలి అడుగు వేశాడు. కుమార్తె జన్మదినం సందర్భంగా కొన్ని మొక్కలు కొనుగోలు చేసి నాటాడు. అయితే ఇలాంటి సందర్భంలో మొక్కలు నాటడం చూసి ఇదేం విడ్డూరం అని అనుకున్నా.. వాటిని పట్టించుకోలేదు. ప్రకృతి పరిరక్షణకు పిల్లల జన్మదిన వేడుకలకు ఓ మంచి పనిచేయండి అని స్నేహితులు,బంధువులు, పరిచయమున్న వారిని అడిగేవాడు. మీ పిల్లల జన్మదినోత్సవానికి గుర్తుగా మొక్కలు నాటండని పిలుపునిచ్చాడు. తన సొంత డబ్బుతో నర్సరీ నుంచి బాదం, వేప, కొబ్బరి తదితర మొక్కలను కొనుగోలు చేసి వారితో నాటించాడు. నాటిన మొక్కలను సంరక్షించే బాధ్యతను తానే తీసుకున్నాడు. ఈ క్రమంలో కొంతమంది ముందుకువచ్చి శ్రీనుకు సహకరించగా, మరింతమంది ఎగతాళి చేశారు. అయినా శ్రీను తన ఆశయసాధనలో వెనక్కి తగ్గలేదు. మొక్కల పెంపకాన్ని జీవన గమనంగా చేసుకుని ముందుకు సాగుతున్నాడు.



పాఠశాలలో మొక్కలు అందజేస్తున్ననాటుతున్న శ్రీను

దాతల సహకారంతో..

తన ఆశయ సాధనకు కొంతమంది ఆర్థిక సహకారం అందించారు. దాంతో మరింత ముందుకు వెళ్తున్నాడు. పాత పెందుర్తి, పెట్రోల్‌బంకు, ఆరోగ్య కేంద్రం, గౌరీ సేవా సంఘం, శ్మశానవాటిక ప్రాంతాల్లో విరివిరిగా మొక్కలు నాటి సంరక్షణ చర్యలు చేపట్టాడు. హుద్‌హుద్ ప్రళయంలో వేలాది వృక్షాలు నేల కొరగడంతో పచ్చదనం, పర్యావరణాన్ని ప్రేమించే శ్రీను కదిలిపోయాడు. మొక్కల పునరుద్ధరణకు ప్రజలను భాగస్వాములను చేశాడు. ప్రయత్నం ఫలించి ఎంతోమంది స్వచ్ఛందంగా ముందుకు వచ్చి విరివిగా మొక్కలు నాటారు. వేసి వదిలేయడమే కాకుండా ప్రతిరోజు ఉదయం వాటికి నీరు పోసి సంరక్షిస్తున్నారు. ఇలా ఇప్పటి వరకు శ్రీను స్వయంగా 400 మొక్కలు నాటి పరిరక్షిస్తున్నాడు. మొక్కలు పెంపకం, సంరక్షణకు స్థానిక నేత శరగడం నరసింహమూర్తి ఎంతగానో సహకరిస్తున్నారని, ఇలా మరింత మంది ముందుకువస్తే పర్యావరణాన్ని కాపాడవచ్చని చెబుతున్నాడు.



మొక్కలు నాటేందుకు స్కూటీపై తీసుకువెళుతున్న ఆళ్ల శ్రీను

అవగాహన కార్యక్రమాలు..

ఏదీ ఒక్కరి వల్లే సాధ్యం కాదని గుర్తించిన శ్రీను మొక్కల పెంపకంపై పాఠశాల విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నాడు. వారు పుట్టినరోజులు ఇతర శుభ కార్యక్రమాలకు గుర్తుగా మొక్కలు నాటేలా వారితో ప్రతిజ్ఞ చేయిస్తున్నాడు. ఆచరణలో అమలు చేసేలా ఉత్సాహపరుస్తున్నాడు. పర్యావరణ పరిరక్షణకు కృషిచేయాలని విస్తృత ప్రచారం చేస్తున్నాడు. కాలుష్యం లేని ద్విచక్ర వాహనం కొనుగోలు చేసి ఊరూరా మొక్కల పెంపకం ఆవశ్యకతను వివరిస్తున్నాడు. శ్రీను చేస్తున్న ఈ కృషికి గుర్తింపుగా ఇటీవల పెందుర్తి గౌరీ సంఘ కల్యాణ మండపంలో అతడిని సత్కరించారు.

సహకరిస్తే మరింత ముందుకు



మొక్కలు నాటడంతో పాటు వాటి సంరక్షణ చాలా కీలకం. ఇందుకోసం సహకారం అవసరం. జీవీఎంసీ సహకరిస్తే పదివేల మొక్కలు నాటాలన్నది నా లక్ష్యం. కొంతమంది మొక్కలు నాటి వదిలేస్తారు. దానివల్ల ఎలాంటి ఫలితం ఉండదు. అవి చెట్లుగా మారే వరకు పోషణ బాధ్యత కూడా చూడాలి. నేను నాటిన ప్రతి మొక్కా ఎదిగేవరకు వాటి బాధ్యతలు తీసుకుంటాను. అందులో ఎంతో తృప్తి ఉంది. జీవీఎంసీ అధికారులు స్పందించి ట్రీగార్డులు అందిస్తే రహదారుల పక్కన మంచి మొక్కలు నాటి సంరక్షించాలన్నది నా ఆశయం.

- ఆళ్ల శ్రీను, పెందుర్తి



ఆళ్ల శ్రీనుకు సత్కారం

అరుదైన విజయం

- ఒకే కుటుంబానికి చెందిన నలుగురికి గిన్నిస్ బుక్‌లో చోటు
- రికార్డు సృష్టించిన అనకాపల్లి గవరపాలేనికి చెందిన ఫ్యామిలీ
- చైనాలో డ్యాన్స్ అండ్ యోగా స్కూల్ స్థాపించిన కొణతాల విజయ్
- యోగాలో ప్రపంచ రికార్డు
- ఆయనతో పాటు భార్య, కుమార్తె, కుమారుడు గిన్నిస్ బుక్ రికార్డులు సాధించడంతో ప్రశంసల వెల్లువ

(కొత్తూరు- ఆంధ్రజ్యోతి)

కృషి, పట్టుదల ఉంటే అనుకున్న లక్ష్యాన్ని సాధించవచ్చని నిరూపించాడు అనకాపల్లి గవరపాలెం ప్రాంతానికి చెందిన కొణతాల విజయ్. సాధారణ డ్యాన్సర్ నుంచి కొరియోగ్రాఫర్‌గా ఎదిగి యోగాలో కూడా నిష్ణాతుడై చైనాలో డ్యాన్స్ అండ్ యోగా స్కూల్ స్థాపించాడు. యోగాలో గిన్నిస్ బుక్ రికార్డు సాధించాడు. అతనే కాదు ఆయన భార్య, కుమార్తె, కుమారుడు కూడా గిన్నిస్ బుక్ రికార్డులు సాధించి చరిత్ర సృష్టించారు. ఇలా ఒకే కుటుంబంలో నలుగురు గిన్నిస్ బుక్ రికార్డులు సాధించడం అరుదు. అనకాపల్లి గవరపాలెం ప్రాంతానికి చెందిన కొణతాల విజయ్ హైదరాబాద్‌లో సినీ డ్యాన్సర్‌గా చేసి చాలా టీవీ షోలలో జడ్జిగా, కొరియోగ్రాఫర్‌గా వ్యవహరించారు. 2012లో చైనాకు వెళ్లి అక్కడ డ్యాన్స్ అండ్ యోగా స్కూల్‌ను ఏర్పాటు చేసి స్థిరపడ్డారు. అక్కడే చైనా వాసులకు యోగా, డ్యాన్స్‌లలో శిక్షణ ఇచ్చి ఎంతో మంది మన్ననలు పొందారు. అలాగే ఆయన సతీమణి కొణతాల జ్యోతి యోగాలో నిష్ణాతురాలు. విజయ్ 2012లో యోగాలో అత్యుత్తమ స్థాయిలో యోగాసనాలు వేసి గిన్నిస్ బుక్ రికార్డు సాధించారు. అలాగే ఆయన సతీమణి జ్యోతి గర్భిణిగా ఉన్నప్పుడు అత్యధిక యోగాసనాలు వేసి గిన్నిస్ బుక్ రికార్డు సాధించారు. వీరి కుమార్తె జస్మిత ఈ ఏడాది జూన్ 1న మోస్ట్ స్కిప్పింగ్(ఒంటి కాలిపై)లో 168 స్కిప్పింగ్స్ ఒకే నిమిషంలో చేసి గిన్నిస్ బుక్ రికార్డు సాధించింది. ఈ ఏడాది అక్టోబరు 31న వారి కుమారుడు శంకర్ స్కిప్పింగ్‌లో గిన్నిస్ బుక్ రికార్డు సాధించాడు. వీరు సాధించిన ఘనతకు దేశ, విదేశాల నుంచి కూడా ప్రశంసలు అందుతున్నాయి.



గిన్నిస్ బుక్ రికార్డులు సాధించిన కొణతాల విజయ్, జ్యోతి, జస్మిత, శంకర్



చైనాలో యోగా శిక్షణ ఇస్తున్న విజయ్

భారత్ జట్టులో స్థానమే లక్ష్యం

- ఐపీఎల్ క్రికెటర్ పైలా అవినాశ్

సింహాచలం, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): భారత్ జట్టులో స్థానమే తన లక్ష్యమని ఉమ్మడి విశాఖ జిల్లాకు చెందిన ఆంధ్రా రంజీ క్రికెటర్ పైలా అవినాశ్ అన్నారు. సోమవారం ఆయన వరాహలక్ష్మీనృసింహస్వామిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్)కు ఇటీవల జరిగిన వేలం లో రూ. 30 లక్షలతో పంజాబ్ కింగ్స్ జట్టుకు ఎంపికైనట్టు చెప్పారు. మ్యాచ్‌లో ప్రతిభ చూపి, భారత్ జట్టులో స్థానం పొందేందుకు తగిన కసరత్తు చేస్తున్నట్టు తెలిపారు.



పైలా అవినాశ్

గ్రామాల అభివృద్ధే కూటమి లక్ష్యం

... 5వ పేజీ తరువాయి

ఈ ప్రాంత ప్రజలకు సాగు, తాగునీరు అందించాలని కూటమి ప్రభుత్వం కంకణం కట్టుకుందని ఆయన చెప్పారు. వైసీపీ పాలనలో మరమ్మతులకు నోచుకోని రోడ్లన్నింటినీ అభివృద్ధి చేస్తున్నామని, సంక్రాంతినాటికి పనులు పూర్తి చేసేందుకు రూ.850 కోట్లు మంజూరు చేశామని వివరించారు. మెగా డీఎస్సీ ద్వారా 16,345 ఉపాధ్యాయ ఉద్యోగాలను భర్తీ చేయనున్నట్టు వెల్లడించారు.

అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్ మాట్లాడుతూ, అనకాపల్లి జిల్లాలో రూ.లక్షా 50 వేల కోట్లతో స్టీలుప్లాంట్ నిర్మాణం జరగనున్నదని, దీంతోపాటు పలు అభివృద్ధి పనుల శంకుస్థాపనకు జనవరి 8వ తేదీన ప్రధానమంత్రి నరేంద్రమోదీ జిల్లాకు వస్తారని తెలిపారు. అనకాపల్లి-రాజమహేంద్రవరం మధ్య ప్రస్తుతం ఉన్న నాలుగు లేన్ల జాతీయ రహదారిని త్వరలో ఆరు లేన్లకు విస్తరిస్తున్నామని, అనకాపల్లి-విశాఖపట్నం రహదారిని కూడా విస్తరించడానికి కృషి చేస్తున్నామని చెప్పారు. జిల్లాలో మూడు కేంద్రీయ విద్యాలయాలను ఏర్పాటు చేయనున్నట్టు ఆయన తెలిపారు. ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ మాట్లాడుతూ, కశింకోట మండలంలో మరమ్మతుకు గురైన గ్రోయిన్లను బాగు చేయిస్తామని చెప్పారు.

అంతకుముందు రూ.1.1 కోట్లతో కశింకోట పడమటమ్మ తల్లి గుడికి వెళ్లే రహదారి, రూ.1.47 కోట్లతో గోపాలపురం- చిన్నముసిలివాడ రోడ్డు, రూ.1.96 కోట్లతో సంపతిపురం- కశింకోట రోడ్డు నిర్మాణానికి అయ్యన్నపాత్రుడు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు, కార్పొరేషన్ల చైర్మన్లు పీలా గోవింద సత్యనారాయణ, చైర్మన్ మళ్ల సురేంద్ర, మాజీ ఎమ్మెల్సీ బుద్ద నాగజగదీశ్వరరావు, సంపతిపురం సర్పంచ్ నంబారు నాగమణి, వివిధ పార్టీలకు చెందిన వేగి గోపీకృష్ణ, సిదిరెడ్డి శ్రీనివాసరావు, కాండ్రేగుల సతీశ్‌కుమార్, నంబారు శ్రీను, కాయల మురళీ, గొంతిన శ్రీనివాసరావు, చదరం నాగేశ్వరరావు, ఎంపీడీవో రవికుమార్, తహసీల్దార్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

సబ్ రిజిస్ట్రార్ ఆఫీసులో స్టాంపుల కొరత

... 5వ పేజీ తరువాయి

స్టాంపులు గత నెల 20వ తేదీన అయిపోయాయి. ఇక కోర్టు ఫీ స్టాంపులు అక్టోబరులో, నోటరీ స్టాంపులు ఈ నెల 13వ తేదీన అయిపోయాయి. బ్యాంకు రుణాలు తీసుకునేవారు స్పెషల్ ఎడ్‌హెసివ్ స్టాంపుల కోసం కోటవురట్ల సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి వెళుతున్నారు. అక్కడ లేకపోతే నక్కపల్లి, ఎలమంచిలి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు వెళ్లాల్సి వస్తున్నది. జిల్లా రిజిస్ట్రార్‌కి ఇండెంట్ పెట్టినప్పటికీ స్టాక్ రాలేదని స్థానిక సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం వర్గాలు చెబుతున్నాయి. దీనిపై జిల్లా రిజిస్ట్రార్ మన్మథరావుని 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా... ఎక్కువ స్టాక్ ఉన్న సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల నుంచి సర్దుబాటు చేస్తామని చెప్పారు.

కళలకు కేంద్ర బిందువు అనకాపల్లి

ఎంపీ సీఎం రమేశ్

అనకాపల్లి టౌన్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): కళలకు కేంద్ర బిందువు అనకాపల్లి అని స్థానిక ఎంపీ సీఎం రమేశ్ అన్నారు. పట్టణంలోని జార్జిక్లబ్ ఆవరణలో జార్జి క్లబ్, హైదరాబాద్ కళావిపంచి, తెలుగు డ్రామా సంయుక్తంగా నిర్వహిస్తున్న తెలుగు రాష్ట్రాల ఆహ్వాన నాటకోత్సవాలను సోమవారం రాత్రి ఆయన జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ, సీఎస్ఆర్ నిధులతో రానున్న రెండేళ్లలో జార్జి క్లబ్‌ను అభివృద్ధి చేస్తామన్నారు. తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దాడి రత్నాకర్ మాట్లాడుతూ, గతంలో కళాకారులకు నెలకు రూ.10 వేలు పింఛన్ ఉండేదని, వైసీపీ పింఛన్‌ను నిలిపివేసిందన్నారు. కళాకారులకు పింఛన్ సౌకర్యాన్ని పునరుద్ధరించాలని ఎంపీని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ బుద్ద నాగజగదీశ్వరరావు, గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ల సురేంద్ర, క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు బీఎస్ఎంకే జోగినాయుడు, బుద్ద కాశీవిశ్వేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు. అనంతరం అనకాపల్లి షిర్డిసాయి కల్చరల్ వెల్ఫేర్ అసోసియేషన్ కళాకారులు ప్రదర్శించిన 'వేదాంతం', సౌజన్య కళాస్రవంతి కళాకారుల ప్రదర్శించిన 'దేవరాగం' నాటికలు ఆహూతులను ఆకట్టుకున్నాయి.



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఎంపీ సీఎం రమేశ్

28న 'పేటలో మెగా జాబ్ మేళా

అనకాపల్లి కలెక్టరేట్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఉపాధి కల్పన సంస్థ, సీడాప్ సంయుక్తంగా ఈ నెల 28న పాయకరావుపేటలోని శ్రీప్రకాష్ డిగ్రీ కళాశాలలో మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్టు కలెక్టర్ విజయకృష్ణన్ తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లో జాబ్ మేళా పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, మెగా జాబ్ మేళాకు దాదాపు 50 దేశీయ, బహుళ జాతి కంపెనీల ప్రతినిధులు హాజరై సుమారు రెండు వేల ఉద్యోగాలకు అభ్యర్థులను ఎంపిక చేసుకుంటారని తెలిపారు. జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఎస్.గోవిందరావు మాట్లాడుతూ, పదో తరగతి, ఇంటర్మీడియట్, డిగ్రీ, ఇంజనీరింగ్, పీజీ, డిప్లొమా, ఐటీఐ పూర్తి చేసి, 18 నుంచి 40 సంవత్సరాల లోపు వయసున్న నిరుద్యోగులు జాబ్ మేళాకు హాజరుకావచ్చని చెప్పారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు తమ వివరాలను నైపుణ్యం.ఏపీ.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్‌లో తప్పనిసరిగా నమోదు చేసుకొని అడ్మిట్ కార్డును డౌన్‌లోడ్ చేసుకోవాలని, దీంతోపాటు ఆధార్‌కార్డు, విద్యార్హత సర్టిఫికెట్ల జెరాక్స్ కాపీలతో ఈ నెల 28వ తేదీ ఉదయం తొమ్మిది గంటలకు జాబ్‌మేళా జరిగే ప్రదేశానికి హాజరు కావాలన్నారు. వివరాలకు 7893799420, 9492429425, 9010793492 నంబర్లకు ఫోన్ చేసి సంప్రదించాలన్నారు.

ఫార్మా బాధితులకు ఎమ్మెల్యే పంచకర్ల పరామర్శ

అక్కిరెడ్డిపాలెం, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): పరవాడ మండలంలోని ఫార్మాసిటీ రక్షిత డ్రగ్స్ కంపెనీలో విష వాయువు లీకైన ఘటనలో అస్వస్థతకు గురై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కార్మికులను సోమవారం ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు పరామర్శించారు. షీలానగర్ కిమ్స్ ఐకాన్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కార్మికులు దేవ్‌బాగ్, ముకేశ్ గౌడ్‌ల ఆరోగ్య పరిస్థితి గురించి అడిగి తెలుసుకున్నారు. వారికి మెరుగైన వైద్యాన్ని అందించాలని వైద్యులకు ఎమ్మెల్యే సూచించారు.



బాధితుడిని పరామర్శిస్తున్న పంచకర్ల రమేశ్‌బాబు

లింగ నిర్ధారణ చేస్తే కఠిన చర్యలు

- స్కానింగ్ సెంటర్ల తనిఖీకి ప్రత్యేక కమిటీ
- కలెక్టర్ విజయకృష్ణన్

అనకాపల్లి కలెక్టరేట్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): గర్భస్థ పిండ లింగ నిర్ధారణ పరీక్షలు చట్టరీత్యా నేరమని, అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ విజయకృష్ణన్ ఆదేశించారు. గర్భస్థ పిండ లింగ నిర్ధారణ చట్టంపై జిల్లాస్థాయి కమిటీ సమావేశం సోమవారం ఇక్కడ కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, గర్భస్థ పిండ లింగ నిర్ధారణ చట్టం-1994ను పక్కాగా అమలు చేయాలని, చట్టాన్ని ఉల్లంఘించిన వారికి మూడు సంవత్సరాల జైలు శిక్ష, పది వేల రూపాయల జరిమానా విధించడం జరుగుతుందని తెలిపారు. స్కానింగ్ సెంటర్ల తనిఖీకి మండలస్థాయిలో శిశు సంక్షేమ శాఖ, తహసీల్దార్, పోలీస్ అధికారులతో ప్రత్యేక కమిటీని నియమించినట్టు తెలిపారు. ప్రోగ్రాం అధికారులు విస్తృతంగా తనిఖీలు నిర్వహించాలని స్పష్టం చేశారు. జిల్లాలో ప్రస్తుతం మగ, ఆడ నిష్పత్తి 1000: 981గా వుందని, లింగ నిష్పత్తి సమానంగా ఉండాలన్నారు. రెండోసారి గర్భం దాల్చిన మహిళల పట్ల స్త్రీ శిశు సంక్షేమ శాఖ సిబ్బంది ప్రత్యేక దృష్టి సారించాలని, గర్భ నిర్ధారణ జరగకుండా అవగాహన కల్పించాలన్నారు. లింగ నిర్ధారణ పరీక్షల ద్వారా ఆడ శిశువు అని తెలిసి గర్భస్రావాలు చేయించినట్టు సమాచారం తెలిస్తే 102, 104 టోల్‌ఫ్రీ నంబర్లకు లేదా ఆన్‌లైన్ గ్రీవియన్స్ ద్వారా తెలియజేయవచ్చని చెప్పారు. ఆడపిల్లలను కూడా మగ పిల్లలతో సమానంగా చూడాలని, ఆడపిల్ల రక్షణ బాధ్యత మనదే అని అన్నారు. ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు.. ఆడపిల్లల ప్రాముఖ్యతను కొత్తగా పెళ్లయిన, వారికి, గర్భవతులకు, ఆమె భర్తతోపాటు అత్తమామలకు అవగాహన కల్పించాలని ఆమె సూచించారు. సమావేశంలో డీఎంహెచ్‌వో బాలాజీ, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ జ్యోతి, గైనకాలజిస్ట్ శోభాదేవి పాల్గొన్నారు.

జడ్పీలో వైసీపీ ఫ్లోర్ లీడర్‌గా పైలా



సన్యాసిరాజును అభినందిస్తున్న జడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర, సభ్యులు

విశాఖపట్నం, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): జిల్లా పరిషత్‌లో వైసీపీ ఫ్లోర్ లీడర్‌గా పరవాడ జడ్పీటీసీ సభ్యుడు పైల సన్యాసిరాజు ఎన్నికయ్యారు. చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర అధ్యక్షతన జడ్పీలో సోమవారం వైసీపీ జడ్పీటీసీ సభ్యులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఫ్లోర్‌లీడర్‌గా ఎన్నికైన సన్యాసిరాజును సభ్యులంతా అభినందించారు.

రక్షిత్ ఫార్మాలో ప్రమాదం

... 5వ పేజీ తరువాయి

అధికారులు పరిశీలించారు. ప్రమాదం ఎలా జరిగిందో యాజమాన్యాన్ని అడిగి తెలుసుకున్నారు. వాయువులు ఎక్కడ లీకయ్యాయో తెలుసుకునే పనిలో ఉన్నారు.

ఫార్మాసిటీలో వరుస ప్రమాదాలతో ఆందోళన

అనకాపల్లి, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): పరవాడ ఫార్మాసిటీలో వరుస ప్రమాదాలు చోటు చేసుకుంటుండడం ఆందోళన కలిగిస్తున్నది. నవంబరు 26వ తేదీన ఠాగూర్ ఫార్మా లేబొరేటరీస్‌లో విషవాయులు లీకైన సంఘటనలో పలువురు కార్మికులు తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. వీరిలో ఒక కార్మికుడు మృతిచెందాడు. ఈ నెల ఆరో తేదీన శ్రీఆర్గానిక్స్ ఫార్మా కంపెనీలో ప్రొడక్షన్ బ్లాక్‌లోని డ్రయ్యర్ యంత్రం నుంచి ఉత్పత్తిని బయటకు తీసే క్రమంలో మ్యాన్ హోల్ ఓపెన్ చేస్తుండగా ఇద్దరు కార్మికులపై రసాయనాలు పడడంతో తీవ్ర గాయాలయ్యాయి.

రక్షిత్ సంఘటనపై విచారణకు ఆదేశం

ఫార్మా సిటీలోని రక్షిత్ డ్రగ్స్ ఫార్మా కంపెనీలో సోమవారం విషవాయువు విడుదలై తీవ్ర అస్వస్థతకు గురైన కార్మికులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని, ఈ సంఘటనపై విచారణ జరిపి నివేదిక ఇవ్వాలని జిల్లా పరిశ్రమల శాఖ, కాలుష్య నియంత్రణ మండలి అధికారులను కలెక్టర్ విజయకృష్ణన్ ఆదేశించారు.

క్రైం... crime news

మద్యం మత్తులో భార్యపై కత్తితో దాడి

హుకుంపేట డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో భార్యపై భర్త కత్తితో దాడి చేసిన సంఘటన మండలంలోని ఓల్డా పంచాయతీ కేంద్రంలో సోమవారం చోటుచేసుకుంది. తీవ్రంగా గాయపడిన బాధితురాలిని గ్రామస్థులు వెంటనే ఆస్పత్రికి తరలించారు. దీనికి సంబంధించి వివరాలు ఇలా వున్నాయి. ఓల్డా గ్రామానికి చెందిన భార్యాభర్తలు మజ్జి చిట్టిబాబు, అప్పలమ్మ సోమవారం కలిసి మద్యం సేవిస్తున్నారు. ఈ క్రమంలో వారి మధ్య స్వల్ప వివాదం తలెత్తడంతో భార్యపై చిట్టిబాబు కత్తితో దాడి చేశాడు. దీంతో ఆమె మెడపై గాయాలయ్యాయి. వెంటనే గ్రామస్థులు ఆమెను ఉప్ప ఆరోగ్య కేంద్రానికి తరలించారు. అయితే పరిస్థితి విషమంగా ఉండడంతో జిల్లా ఆరోగ్య కేంద్రానికి తరలించారు.



చికిత్స పొందుతున్న అప్పలమ్మ

గంజాయి కేసులో 20 ఏళ్లు జైలు శిక్ష

కశింకోట, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): గంజాయి కేసులో ఇద్దరు ముద్దాయిలకు 20 ఏళ్ల జైలు శిక్ష విధిస్తూ 10వ అదనపు జిల్లా జడ్జి ఎస్.శ్రీవిద్య సోమవారం తీర్పు ఇచ్చారు. ఈ మేరకు జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా ఒక ప్రకటనలో వివరాలు వెల్లడించారు. అల్లూరి సీతారామరాజు జిల్లా జి.మాడుగుల మండలానికి చెందిన వంతల రాజుబాబు, చింతపల్లి గ్రామానికి చెందిన వశపారి రాంప్రసాద్‌లు ఐదేళ్ల క్రితం 20 కిలోల గంజాయిని కారులోని తరలిస్తుండగా కశింకోట మండలం తాళ్లపాలెం వద్ద అప్పటి ఎస్ఐ ఎ.వి.ఎస్.వి. రామకృష్ణ పట్టుకున్నారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు అనంతరం కోర్టులో చార్జిషీటు దాఖలు చేశారు. పలువాయిదాల అనంతరం న్యాయమూర్తి శ్రీవిద్య సోమవారం తీరు వెలువరించారు. ముద్దాయిలకు 20 ఏళ్లపాటు జైలు శిక్ష, రూ.లక్ష చొప్పున జరిమానా విధించారు. ఈ కేసుకు సంబంధించి ముద్దాయిలకు శిక్షపడేలా దర్యాప్తు నిర్వహించిన అప్పటి ఎస్ఐ రామకృష్ణను, ప్రస్తుత సీఐ అల్లు స్వామి నాయుడు, సిబ్బందిని ఎస్పీ అభినందించారు.

వ్యక్తి మృతికి కారణమైన ముద్దాయికి జైలు

విశాఖలీగల్, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): ఒక వ్యక్తి మృతికి కారణమైన ముద్దాయికి ఐదేళ్ల జైలు, రూ.2వేల జరిమానా విధిస్తూ ఒకటో జిల్లా అదనపు న్యాయమూర్తి ఎం.వెంకటరమణ సోమవారం తీర్పు చెప్పారు. జరిమానా చెల్లించని పక్షంలో మరో ఆరునెలలు అదనంగా జైలు శిక్ష అనుభవించాల్సి ఉంటుందని తీర్పులో పేర్కొన్నారు. అల్లూరి జిల్లా పెదబయలు మండలం పెద్దకోడపల్లికి చెందిన గంపదర సత్తిబాబు పంట పొలానికి అడవి జంతువులు రాకుండా కంచె నిర్మించాడు. దానికి రాత్రిపూట విద్యుత్ ఏర్పాటు చేశాడు. ఈ క్రమంలో గ్రామానికి చెందిన మజ్జి బాలరాజు 2014 సెప్టెంబరు 5న సంతకు వెళ్లేందుకు కంచె ఉన్న ప్రాంతం దాటుతూ విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య నూకాలమ్మ ఫిర్యాదు మేరకు పెదబయలు పోలీసులు కేసు నమోదు చేసి, కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. నేరం రుజువుకావడంతో న్యాయమూర్తి శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు.

రోడ్ల పనులకు వర్షాలతో ఆటంకం!

... 5వ పేజీ తరువాయి

చేపట్టేందుకు ఆర్‌అండ్‌బీ ఇంజనీర్లు టెండర్ల ప్రక్రియ పూర్తిచేసి కాంట్రాక్టర్లతో అగ్రిమెంట్లు చేసుకున్నారు. ఈ పనులను సంక్రాంతి పండుగలోగా పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. అయితే రెండు వారాల నుంచి వరుస అల్పపీడనం/ వాయుగుండాల ప్రభావంతో చెదురుమదురుగా వర్షాలు పడుతుండడంతో ఆ ప్రభావం రోడ్ల పనులపై పడింది. రహదారుల నిర్మాణం, మరమ్మతు పనులకు వర్షాలు బ్రేకులు వేశాయి. ముఖ్యంగా తారు రోడ్డు పనులను పూర్తిగా ఆపేశారు. వర్షం పడకపోయినాసరే ఆకాశం మేఘావృతమై వుంటే తారు రోడ్డు వేయరు. దీంతో కాంట్రాక్టర్లు రోడ్డు పనులను నిలిపేశారు. సంక్రాతి పండుగనాటికి పనులు పూర్తవుతాయా అన్నది ప్రశ్నార్థకంగా మారింది. వర్షాల కారణంగా రహదారుల నిర్మాణం, మరమ్మతు పనులు ఆగిన మాట వాస్తమేనని, వర్షాలు తగ్గిన వెంటనే పనులు వేగవంతం చేస్తామని ఆర్‌అండ్‌బీ ఈఈ రమేశ్ 'ఆంధ్రజ్యోతి' ప్రతినిధికి తెలిపారు. జనవరి రెండో వారం లోగా అన్ని రోడ్ల పనులు పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని పేర్కొన్నారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	90.00
లైవ్ ధర	110.00
విత్ స్కిన్	190.00
స్కిన్ లెస్	200.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	595
విజయనగరం	599
శ్రీకాకుళం	599